# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం-19-సెప్టెంబర్-2025 | సంపుటి : 3 | సంచిక : 114 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## నియోజకవర్గ రైతుల కోసం ఎమ్మెల్యే 2 కోట్ల రూ.లు విరాళం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసిన మిర్యాలగూడ శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి 2 కోట్ల రూపాయల చెక్కును అందజేశారు. కుమారుడి వివాహ రిసెప్షన్ కోసం ఖర్చు చేయాలనుకున్న డబ్బును నియోజకవర్గంలోని రైతులకు ఉపయోగపడే కార్యక్రమంగా మార్చుకోవాలని భావించి 2 కోట్ల రూపాయల చెక్కును ముఖ్యమంత్రికి అందించారు. లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులు, నల్గొండ లోక్‌సభ సభ్యులు కుందూరు రఘువీర్ తో వచ్చి ముఖ్యమంత్రిని కలిసి చెక్కును అందించారు. ఆ డబ్బును మిర్యాలగూడ నియోజకవర్గంలోని రైతుల కోసం ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో దాదాపు లక్ష మంది రైతులకు ఒక్కొక్కరికి ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందజేయాలని కోరారు. లక్ష్మారెడ్డి తన కుమారుడు సాయి ప్రసన్న వివాహ రిసెప్షన్ మిర్యాలగూడలో నిర్వహించాలని భావించినప్పటికీ దాన్ని రద్దు చేసుకుని ఆ డబ్బును రైతులకు ఉపయోగపడే కార్యక్రమం చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. రైతులకు ప్రయోజనం కలిగించే ఒక మంచి నిర్ణయం తీసుకున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని, వారి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి అభినందించారు.

## అభివృద్ధి చేస్తుంటే అడ్డుకుంటున్నారు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని ఆరోపణ
- యూరియా సరఫరా బాధ్యత కేంద్రానిదేనని స్పష్టీకరణ
- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది గత ప్రభుత్వమేనని విమర్శ
- మంత్రి సీతక్క

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌పై బురద చల్లుతున్నారని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తీవ్రంగా విమర్శించారు.

మిగతా 2లో





## సీఎం రేవంత్ రెడ్డితో బ్రిటన్ హైకమిషనర్ భేటీ..

- తెలంగాణ విద్యార్థులకు యూకే స్కాలర్‌షిప్స్‌కు అంగీకారం
- తెలంగాణ విద్యార్థులకు చెవెనింగ్ స్కాలర్‌షిప్స్‌కు బ్రిటన్ అంగీకారం
- రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ ఇచ్చేందుకు సుముఖత
- మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానం
- వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరిన ముఖ్యమంత్రి
- ముఖ్యమంత్రి ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన బ్రిటీష్ హైకమిషనర్

2లో




### పార్టీ మారుతున్నట్లు వస్తున్న
## ప్రచారం అవాస్తవం

- మంత్రి పదవి రానందుకు అసంతృప్తి అనడం అవాస్తవమని వ్యాఖ్య
- కొందరు కావాలనే సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని మండిపాటు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
తాను పార్టీ మారుతున్నట్లు, కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారంపై మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు.

మిగతా 2లో

## భాగ్యనగరంలో మిశ్రమ వాతావరణం



- రహదారులు చెరువులుగా, బస్తీల్లోకి వరదనీరు
- ట్రాఫిక్ జామ్‌తో నగర జీవనం అస్తవ్యస్తం
- సహాయక చర్యల్లో జీహెచ్ఎంసీ, జలమండలి, పోలీసు, హైడ్రా బృందాలు
- నలుదిక్కులా ట్రాఫిక్ చక్రబంధం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం విజ్ఞప్తి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
భాగ్యనగరంలో ఒకేరోజు మిశ్రమ వాతావరణం కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు భానుడు ప్రతాపం చూపగా....

మిగతా 2లో

### పిల్లలకు సురక్షిత నగరంగా
## హైదరాబాద్ ను తీర్చిదిద్దుతాం

**యూనిసెఫ్ తో కలిసి కార్యాచరణ ప్రకటించిన మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
హైదరాబాద్‌లో పిల్లల భద్రత కోసం నగర స్థాయి కార్యాచరణ ప్రణాళిక''ను తెలంగాణ ప్రభుత్వం, యూనిసెఫ్ సంయుక్తంగా ప్రారంభించింది. పిల్లలకు హైదరాబాద్ ను సురక్షిత నగరంగా మార్చుతామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క, రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. క్లాప్ ఫర్ చిల్డ్రన్ పోస్టర్ను సచివాలయంలో గురువారం నాడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, హైదరాబాద్‌ను ''పిల్లలకి సురక్షిత నగరం''గా తీర్చి దిద్దడానికి కృషి చేస్తుందని.. ఇతర నగరాలు, రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా హైదరాబాద్ ను తీర్చిదిద్దామన్నారు. ఈ ప్రయత్నంలో యూనిసెఫ్ సంస్థకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడిరచారు. ఈ ప్రణాళిక ద్వారా ప్రభుత్వ విభాగాలు, చట్టపరమైన సంస్థలు, సమాజం కలిసి పిల్లలు సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదగడానికి కృషి చేయనున్నారు.

మిగతా 2లో




## ముందు మీ ఇల్లు చక్కదిద్దుకోండి

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సత్తా చూపాలని బీఆర్ఎస్‌కు సవాల్
- పదేళ్లలో పేదలకు ఇళ్లు కట్టడంలో బీఆర్ఎస్ విఫలమైందని ఆరోపణ
- కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల కమీషన్లకే పరిమితమయ్యారని విమర్శ
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2లో





## దమ్ముంటే రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మీ పార్టీ సత్తా చూపించండి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)
`బీఆర్ఎస్ పార్టీ కి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సవాల్
ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఏదులాపురం మున్సిపాల్టీలోని వరంగల్ క్రాస్ రోడ్డులో వివిధ పార్టీలకు చెందిన 80 కుటుంబాలు

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# అభివృద్ధి చేస్తుంటే అడ్డుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

రైతుల సమస్యల విషయంలో కేంద్రం బాధ్యతను పక్కనపెట్టి, రాష్ట్ర ప్రభుత్వం పై నిందలు వేయడం సరికాదని ఆమె హితవు పలికారు. ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీలో పర్యటించిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. యూరియా సరఫరా అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. అయినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ వాస్తవాలను వక్రీకరించి, రైతులను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపుతోందని ఆమె ఆరోపించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని మంత్రి విమర్శించారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులకు త్వరలోనే మరమ్మతులు చేపడతామని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని, మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీతక్క వివరించారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆమె కోరారు.



# సీఎం రేవంత్ రెడ్డితో బ్రిటన్ హైకమిషనర్ భేటీ..

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ అంతర్జాతీయ స్కాలర్‌షిప్ విషయంలో కోఫండిరగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించాలన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ సూత్రప్రాయంగా ఆంగీకరించారు. భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. వారితో పాటు డిప్యూటీ హైకమిషనర్ (హైదరాబాద్) గారెత్ విన్ ఓవెన్‌ర, పొలిటికల్ ఎకానమీ సలహాదారు నళిని రఘురామన్ కూడా ఉన్నారు. యూకే ప్రభుత్వం అంతర్జాతీయ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ లో భాగంగా అందిస్తున్న చెవెనింగ్ స్కాలర్‌షిప్ లను కోఫండిరగ్ ప్రాతిపదికన తెలంగాణకు చెందిన మెరిట్ విద్యార్థులకు అందించడానికి ఈ సందర్భంగా అంగీకరించారు. విద్య, సాంకేతిక సంబంధిత రంగాల్లో సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు ముఖ్యమంత్రి గారికి వివరించారు.



యూకేలోని యూనివర్సిటీల్లో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం అక్కడి వర్సిటీలు అడ్మిషన్లు, ఇతరత్రా కార్యక్రమాలను హైదరాబాద్ నుంచి ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో కొత్తగా తీసుకురానున్న ఎడ్యుకేషన్ పాలసీ ముసాయిదా గురించి ముఖ్యమంత్రి బ్రిటిష్ హైకమిషనర్‌కి వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ అందించడానికి లిండీ కామెరాన్ సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటిష్ కంపెనీలు భాగస్వాములు కావాలని, ప్రధానంగా జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్ సెంటర్లు, వివిధ అకాడమీలకు సంబంధిత రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించాలన్న ముఖ్యమంత్రి విజ్ఞప్తి పట్ల బ్రిటిషన్ హైకమిషనర్ గారు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భాగ్యనగరంలో మిశ్రమ వాతావరణం



ఆ తర్వాత ఒకేసారి ఆకాశం మేఘావృతమై వరుణ దేవుడు విశ్వరూపం ప్రదర్శించాడు. భారీ వర్షానికి హైదరాబాద్ అతలాకుతలమైంది. గురువారం గంటన్నర పాటు కురిసిన కుండపోత వర్షానికి నగర జీవనం కకావికలమైంది. ఆకాశానికి చిల్లు పడినట్లు వర్షం పడింది. అత్యధికంగా పాతబస్తీ బహదూర్‌పురాలోని జూపార్క్ వద్ద 8.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

ప్రధాన రహదారులు చెరువులను తలపించగా లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. బస్తీల్లోని నివాసాల్లో వరద నీరు వచ్చి చేరింది. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సాయంత్రం వేళ విద్యాసంస్థలు వదలడంతో విద్యార్థులు, డ్యూటీలు ముగించుకొని ఇంటి దారి పట్టిన ఉద్యోగులు ట్రాఫిక్‌లో గంటల కొద్దీ నరక యాతన పడ్డారు. వరద ఉధృతికి రోడ్లపై అడుగు పెడితే కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో రోడ్ల పక్కన నిలిపిన ఆటోలు, ద్విచక్ర వాహనాలు వరదలో కొట్టుకొని పోయాయి. జీహెచ్‌ఎంసీ, జలమండలి, పోలీసు, హైడ్రా బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి.

నాలుగు దిక్కులా చక్ర బంధం

భారీ వర్షానికి హైదరాబాద్ నలుదిక్కులా చక్రబంధంగా ట్రాఫిక్ స్తంభించి పోయింది. నాంపల్లి నుంచి మాసాబ్‌ట్యాంక్, లక్డీకాపూల్ నుంచి ఖైరతాబాద్, సోమాజిగూడ నుంచి మియాపూర్, సచివాలయం నుంచి ట్యాంక్‌బండ్, బేగంపేట నుంచి సికింద్రాబాద్, మెహిదీపట్నం నుంచి రాయదుర్గం, చాంద్రాయణ గుట్ట నుంచి మలక్‌పేట, ఎల్‌బీనగర్ నుంచి ఉప్పల్ తదితర మార్గాల్లో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ అయింది. గంటల కొద్దీ వాహనదారులు నరకయాతన పడ్డారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొన్నం**

మూడు రోజుల్లో పడాల్సిన వర్షం 30 నిమిషాల్లోనే కుంభవృష్టిగా కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రావద్దని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరుతున్న ప్రాంతాల్లో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.



# పార్టీ మారుతున్నట్లు వస్తున్న ప్రచారం అవాస్తవం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఊహాగానాలన్నింటినీ ఆయన తీవ్రంగా ఖండిరచారు. అవన్నీ అవాస్తవాలని, ప్రజలు ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన, తనపై సోషల్ మీడియాలో కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కనందుకే తాను అసంతృప్తితో ఉన్నానని, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పనిచేస్తున్నానని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. “కొంతమంది గిట్టని వ్యక్తులు నా ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కట్టుకథలు ప్రచారం చేస్తున్నారు. నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్లు, పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నాను” అని ఆయన తెలిపారు. తమది కాంగ్రెస్ కుటుంబమని, రెండుసార్లు పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచానని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అంటే తనకు ఎంతో అభిమానమని, వారి నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉందని పునరుద్ఘాటించారు. ఇలాంటి నిరాధారమైన ప్రచారాలను నమ్మి గందరగోళానికి గురికావొద్దని తెలంగాణ ప్రజలను కోరారు.

## పిల్లలకు సురక్షిత నగరంగా

# హైదరాబాద్ ను తీర్చిదిద్దుతాం

(మొదటి పేజీ తరువాయి)

చట్టపరమైన సంస్థలు, ఫ్రంట్ లైన్ సేవలను బలోపేతం చేసి, మహిళా శిశు సంక్షేమ, పోలీసు, ఆరోగ్యం, విద్య, కార్మిక, వంటి విభాగాల సమన్వయంతో బుల్లీయింగ్, ఈవ్‌టీజింగ్, అసురక్షిత రవాణా, మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించడానికి చర్యలు చేపడతారు. బాలల రక్షణ సెల్‌లు, విజిలెన్స్ కమిటీల ద్వారా డేటా ఆధారిత మానిటరింగ్ జరుగుతుంది. అలాగే ఫ్రంట్ లైన్ వర్కర్లకు, పిల్లలకు అనుకూలమైన, శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో మహిలా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీమతి అనితా రామచంద్రన్, యూనిసెఫ్ చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీస్ డా. జెలాలెం బిర్హాను టాఫెస్సే తదితరులు పాల్గొన్నారు.





## దమ్ముంటే రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో

# మీ పార్టీ సత్తా చూపించండి

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల నా మీద కొన్ని అనుచిత వ్యాఖ్యలు చేశారు. నేను ఈసారి ఎలా గెలుస్తానో చూస్తానన్నారు. ఆ ట్విట్టర్ టిల్లుకి నేను ఒకటే చెబుతున్నా.. పాలేరులో నా గెలుపును ఆపడానికి మీ నాయన మూడు సార్లు ముక్కు నేలకు రాసినా.. ఆయన వల్లే కాలేదు.. నీ వల్ల అవుద్దా.. బచ్చాగాడివి.! ముందు నీ ఇంటిని..పార్టీని చక్కబెట్టుకో.! తర్వాత నా గురించి మాట్లాడు. మూడున్నరేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల నాటికి అసలు నువ్వు ఇండియాలో ఉంటావా.. సంచి సర్దుకుని అమెరికాకు చెక్కుతవా.. అన్నది తెలంగాణ రాష్ట్ర ప్రజలు నిర్ణయించడానికి సిద్దంగా ఉన్నారు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అనారు. దమ్ముంటే రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మీ పార్టీ సత్తా చూపించు. బీఆర్ఎస్ పదేళ్ల పాటు ప్రజల కలలను ఛిద్రము చేసింది. వారి హయంలో ప్రతి సంవత్సరం ఒక లక్ష ఇండ్లు కట్టినా పది లక్షల పేద కుటుంబాలకు ఇండ్లు ఉండేవి. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల కమీషన్లలో మునిగిపోయింది. పాము కోరల్లో విషం ఉంటే.. వాళ్లు వొంటి నిండా విషం నింపుకుని తిరుగుతున్నారు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లోనే ప్రజలు వారిని పక్కన పెట్టేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు గట్టి బుద్ధి చెప్తారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేనివి. రాష్ట్రంలో పేదలకు ఇళ్లు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకనే జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గారు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి గారు, టీపీసీసీ నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్, బొర్రా రాజశేఖర్ గారు, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు గారు, కళ్ళెం వెంకట్ రెడ్డి గారు, మద్ది మల్లారెడ్డి గారు, బండి జగదీష్, ప్రతాపనేని రఘు, భూక్యా సురేష్ నాయక్, వెంపటి రవి, భుజంగ రెడ్డి, వీరా రెడ్డి , భాస్కర్ నాయక్ , ప్రద్యుమ్న చారి, సంగయ్య , వెంకట నారాయణ, తోట వీరభద్రం , కర్లపూడి భద్రకాళి, బానోత్ దివ్య, బానోత్ హరి, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ముందు మీ ఇల్లు చక్కదిద్దుకోండి

(మొదటి పేజీ తరువాయి)



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముందు తన ఇంటిని, పార్టీని చక్కదిద్దుకోవాలని హితవు పలికిన ఆయన, రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ సత్తా ఏమిటో చూపించాలని సవాల్ విసిరారు. “నీకు విజన్ ఉందా? మీ నాన్నకు ఉందా? అన్నది తెలుసుకో. మూడున్నరేళ్ల తర్వాత జరిగే ఎన్నికల నాటికి నువ్వు అమెరికాలో ఉంటావో, ఇండియాలో ఉంటావో కూడా ప్రజలకు సందేహంగా ఉంది” అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురువారం వరంగల్ క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన సుమారు 80 కుటుంబాలకు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని విమర్శించారు. “ప్రతి సంవత్సరం లక్ష ఇళ్లు కట్టినా, పదేళ్లలో పది లక్షల పేద కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేరేది. కానీ గత ప్రభుత్వం కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల కమీషన్లపైనే దృష్టి పెట్టింది తప్ప పేదల గృహ నిర్మాణాన్ని పట్టించుకోలేదు” అని ఆయన ఆరోపించారు. పాము కోరల్లో విషం ఉన్నట్టు, బీఆర్ఎస్ నేతలు ఒళ్లంతా విషం నింపుకుని తిరుగుతున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌ను తిరస్కరించారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తగిన బుద్ధి చెబుతారని పొంగులేటి జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు వేగంగా అమలవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీపీసీసీ నాయకులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.



# అల్వాల్ గ్రామ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**వనపర్తి,సెప్టెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పెద్దమందడి మండలం అల్వాల్ గ్రామానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు రెండు కల్యాణలక్ష్మి, మూడు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అందజేశారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులు మైముదా బేగం (భర్త పెద్ద పాషా), గోవిందమ్మ (భర్త గౌనీకాడి వెంకటన్న). సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు : నవత సుదర్శన్ గౌడ్ (₹16,000), అలివేల కృష్ణయ్య-సిపాయి (₹8,000), కే. నరేందర్ రెడ్డి (₹14,500).ఈ కార్యక్రమం అల్వాల్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు జి. సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి పట్ల కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో అల్వాల్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఆదిత్య రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బి.పి. మండల్ 107వ జయంతి ఉత్సవాలు

**మౌలాలి, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గం మౌలాలి డివిజన్ ప్రశాంత్ నగర్ రైల్వే క్వార్టర్స్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బి.పి. మండల్ 107వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, నేషనల్ కమిషన్ ఫర్ బీసీ చైర్మన్ హాన్స్ రాజ్ గంగారం ఆయిర్, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాజ్యసభ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. లక్ష్మణ్, సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవత్సవ హాజరై ప్రసంగించారు.ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బి.పి. మండల్ చేసిన ఓబీసీల సాధికారత పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను కొనియాడారు. జ్యోతిరావు పూలే లాంటి మహనీయుల స్థాయిలో బి.పి. మండల్ విగ్రహాలను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే మల్కాజ్గిరి నియోజకవర్గంలో ఉన్న లెవెల్ క్రాసింగ్ (ఎల్ సి) సమస్యలు పరిష్కరించాలని జీఎంను కోరారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ ఈఏ వర్కింగ్ ప్రెసిడెంట్ మీనాక్షి, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ రాజు యాదవ్, కోశాధికారి నర్సింగ్ రావు, ఏడిఆర్ఎం ముత్యాలనాయుడు, వీఓపి అడ్మిన్ జి.ఎస్. రావు, సీనియర్ డిపిఓ ఆనంద్ కట్ట, బీజేపీ మౌలాలి కార్పొరేటర్లు సునీత శేఖర్ యాదవ్, రాజ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మురుగేష్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, జె.ఏ.సి వెంకన్న, అమీనుద్దీన్, చిన్నా యాదవ్, సర్వేశ్ యాదవ్, నవీన్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, హేమంత్ పటేల్, రాజశేఖర్ రెడ్డి, పిట్టల శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయండి

**టైగర్ జంగయ్య ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి**

**వనపర్తి,సెప్టెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ, గీత, చేనేత కార్మికులకు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ, ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యాలయాల వద్ద ముట్టడిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా ఇన్చార్జి టైగర్ జంగయ్య మాదిగ పిలుపునిచ్చారు.
పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో కొమ్ము చెన్నకేశవులు మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగులకు నెలకు రూ.6,000, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ, గీత, చేనేత కార్మికులకు నెలకు రూ.4,000 పెన్షన్ ఇవ్వాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీ (శనివారం) ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు పెన్షన్ దారులతో మహాధర్నా నిర్వహించాలని, అనంతరం గ్రామ సెక్రటరీకి వినతిపత్రం అందజేయాలని సూచించారు. 19వ తేదీ సాయంత్రం ప్రతి గ్రామంలో డప్పు చాటింపుతో ప్రజలకు సమాచారం చేరవేయాలని, గ్రామాల వారీగా నాయకులు ఇన్చార్జీలుగా వ్యవహరించి ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
జిల్లా వ్యాప్తంగా జరుగనున్న ఈ మహాధర్నా కార్యక్రమాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయరాదని ఆయన స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో గంధం గట్టయ్య మాదిగ, అలివేల (విహెచ్‌పీఎస్ నాయకురాలు), మొలకలపల్లి పరుషరాముడు మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు మచ్చ తిరుపతి మాదిగ, మద్దిలేటి మాదిగ, వృద్ధులు, వితంతువులు తదితరులు పాల్గొన్నారు.





# పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై అవాస్తవాలు మానుకోండి

## బహిరంగ చర్చకు సిద్ధం ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి,సెప్టెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంపై అవాస్తవాలు ప్రచారం చేయడం మానుకోవాలని, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సవాల్ విసిరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయాలు వెల్లడించారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి ప్రజా ప్రభుత్వం అని, అలాంటి ప్రభుత్వాన్ని విమర్శించడం ద్వారా కేటీఆర్ ప్రజల బాలు పలుకుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 12 విడతలలో రూ.60.62 కోట్ల విలువైన సి.ఎం.ఆర్.ఎఫ్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఎల్.ఓ.సి చెక్కులను 10,073 మంది లబ్ధిదారులకు అందజేశామని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిందని విమర్శించిన ఆయన, ఆ పాలనలో కేవలం పేపర్లపైనే పనులు చూపించారని ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 22 నెలల్లోనే వనపర్తి నియోజకవర్గంలో 33,860 మంది రైతులకు రూ.253 కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. విద్యారంగ అభివృద్ధి కోసం రూ.50 కోట్లు, సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి రూ.60 కోట్లు కేటాయించామని చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించిన బీఆర్ఎస్ పార్టీ, స్థానిక ఎన్నికల్లో మళ్లీ ప్రజల ముందుకు వచ్చినా వారిని నమ్మవద్దని, గెలిపిస్తే అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.
కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన గ్రూప్-1 నియామకాలపై నిరాధార ఆరోపణలు చేసిన కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మహిళా విభాగ జిల్లా అధ్యక్షులు శ్రీలత, పీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్‌తో పాటు వనపర్తి పట్టణం, పెద్దమందడి, ఖిల్లా గణపురం, పెబ్బేరు, శ్రీరంగాపురం, రేవల్లి, గోపాలపేట, ఏదుల మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు..







# సత్తుపల్లిలో చారిత్రాత్మక మోటివేషన్ తరగతులు

## 30 వేల మంది విద్యార్థులకు మార్గదర్శనం.. ముఖ్య అతిథి తుమ్మల యుగంధర్

**సత్తుపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని మదర్ తెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం "ప్రేరణ - జ్వలనం" మోటివేషన్ తరగతులు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర యువనేత తుమ్మల యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ, విద్యే ప్రతి విద్యార్థి జీవితానికి బలమైన పునాది. చదువుతోపాటు మంచి ప్రవర్తన, తల్లిదండ్రుల పట్ల గౌరవం, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం భవిష్యత్తును వెలుగులు నింపుతాయి. ప్రతి చదువుకునే బిడ్డకు కాంగ్రెస్ ప్రభుత్వం, ఆశా స్వచ్ఛంద సంస్థ పూర్తి సహకారం అందిస్తుంది. సత్తుపల్లి నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులు దేశానికే గర్వకారణం కావాలి అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ, "తల్లిదండ్రులు చేసిన త్యాగం ఎప్పటికీ మరిచిపోవద్దు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని కృషి చేస్తే తప్పకుండా విజయాలు సాధిస్తారు" అని సూచించారు.విద్యార్థులు ఈ తరగతుల ద్వారా చదువు విలువ, తల్లిదండ్రుల గొప్పతనం గ్రహించామని, భవిష్యత్తులో ఉన్నత స్థితి సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం చలసాని సాంబశివరావు, ప్రిన్సిపాల్, సిబ్బంది, మోటివేషన్ బృందం సుధాకర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# బెస్ట్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న రాజేందర్ రెడ్డి

**వైబ్రెంట్ అకాడమీ డైరెక్టర్ రాజేందర్ రెడ్డికి సన్మానం**

**హనుమకొండ:** విద్యారంగంలో విశేష సేవలందించిన చిట్టేటి రాజేందర్ రెడ్డి ఇటీవల కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి చేతుల మీదుగా "బెస్ట్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు" అందుకున్నారు. ఈ సందర్భంగా 1994-95 విద్యా సంవత్సరం పదవ తరగతి మిత్రబృందం ఆయనను ఘనంగా సన్మానించింది. రెండు దశాబ్దాల పాటు లెక్చరర్‌గా సేవలందించి అనేకమంది విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దిన రాజేందర్ రెడ్డి, కార్పొరేట్ కాలేజీలకు సమానంగా హనుమకొండ పట్టణంలో రాజస్థాన్ కోటా నమూనాలో వైబ్రెంట్ అకాడమీని స్థాపించారు. నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన, పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తూ, తక్కువ కాలంలోనే ఈ విద్యాసంస్థ దక్షిణ తెలంగాణలో పేరుగాంచింది. రాజ్ న్యూస్ వారు ఆయన సేవలను గుర్తించి ఈ విద్యాసంవత్సరంలో "బెస్ట్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు" ప్రదానం చేయగా, చిన్ననాటి మిత్రులు సత్కారం చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో లావుడియా రాజు నాయక్, రాజేశ్వరరావు, రాజయ్య, రఘుపతి, సత్యనారాయణ, రాజేందర్, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, ప్రభాకర్, మల్లికార్జున్, రవి, రమేష్, తిరుపతి, సుధాకర్, సుల్తాన్, నాగరాజు, సునీత, సౌందర్య పాల్గొన్నారు.

# ఈసీఐఎల్ ఫ్యాక్టరీలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడలోని ఈసీఐఎల్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో మహిళలకు భద్రత, చట్టపరమైన సహాయంపై అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడంలో పోలీసు శాఖ అందించే సేవలు, సహాయక పథకాలపై విస్తృతంగా వివరించారు.ఈ సందర్భంగా గృహ హింస చట్టం, షీ టీమ్స్ పాత్ర, సైబర్ నేరాల నివారణ వంటి అంశాలపై మహిళలకు స్పష్టమైన అవగాహన కల్పించారు. మహిళలు ఎటువంటి సమస్యలో చిక్కుకున్నా భయపడకుండా పోలీసులను సంప్రదించాలి అని అధికారులు సూచించారు. కార్యక్రమంలో నల్గొండ జాగృతి పోలీస్ కళాబృందం పాటల ద్వారా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ నంబర్లు - 100, 1091 (వుమెన్స్ హెల్ప్‌లైన్), 181 (శక్తి హెల్ప్‌లైన్) లను గుర్తుంచుకోవాలని సూచించారు.చైల్డ్ అండ్ విమెన్ వెల్ఫేర్ సి డి డబ్ల్యూ టీమ్‌కు చెందిన కౌన్సిలర్లు షారోన్, సవిత మహిళలకు అందుబాటులో ఉన్న కౌన్సిలింగ్ సేవలపై వివరించారు. ఈ సేవలు మహిళలు మరియు పిల్లలకు ఎటువంటి పరిస్థితుల్లోనైనా అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని కుషాయిగూడ ఎస్ హెచ్ ఓ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఐ బి. శ్రీనివాస్, జాగృతి పోలీస్ కళాబృంద సభ్యులు, సి డి డబ్ల్యూ సిబ్బంది, ఈసీఐఎల్ ఫ్యాక్టరీకి చెందిన వైద్యురాలు డాక్టర్ స్వాతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ శాఖ అందిస్తున్న సేవలపై అవగాహన పొందారని, తాము ఎటువంటి సమస్యల్లోనైనా వెనుకాడకుండా పోలీసులను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా మహిళల భద్రత, చట్టపరమైన సహాయంపై సమాజంలో సానుకూల వాతావరణం నెలకొల్పడంలో విజయం సాధించిందని నిర్వాహకులు తెలిపారు.






తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక







# సత్తుపల్లి అభివృద్ధే లక్ష్యం ప్రజల ఆశయాలకు అనుగుణంగా చర్యలు

## పట్టణ సుందరీకరణతో శాశ్వత గుర్తింపు:మంత్రి తుమ్మల

**సత్తుపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి టౌన్ శాశ్వత గుర్తింపు సాధించేలా సమగ్ర అభివృద్ధి చర్యలు చేపడతామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సత్తుపల్లి నీలాద్రి అర్బన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన చైన్‌లింక్ ఫెన్సింగ్, ఎకో ఫ్రెండ్లీ సఫారీ వెహికల్‌ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అటవీశాఖ ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి స్వయంగా బ్యాటరీ వెహికల్ నడుపుతూ కలెక్టర్‌తో కలిసి పార్క్‌లో పర్యటించారు.
తర్వాత ఖమ్మం ప్రధాన రోడ్డులోని అటవీ శాఖ డివిజన్ కార్యాలయంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి మొక్కను నాటారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పోడియం, సత్తుపల్లి అటవీశాఖ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన మీటింగ్ హాల్‌ను మంత్రి ప్రారంభించారు. అడవుల సంరక్షణ కోసం అటవీ సిబ్బందికి రక్షణ పరికరాలు, మొబైల్ ఫోన్లు అందజేశారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సత్తుపల్లి పట్టణ సుందరీకరణ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రజల హృదయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు చిరస్థాయిగా నిలుస్తారని అన్నారు. బేతుపల్లి హై లెవెల్ కెనాల్, వేంసూరు ఎత్తిపోతల పథకం వంటి పనులు శ్రీరాముని ఆశీస్సులతో ముందుకు సాగుతున్నాయని చెప్పారు. రాజకీయాలు, పార్టీలకతీతంగా సత్తుపల్లిని కేంద్రంగా చేసుకొని గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైల్వే లైన్, నీటి పారుదల వంటి అభివృద్ధి పనులకు కృషి చేస్తామని తెలిపారు. నీలాద్రి అర్బన్ పార్క్ అభివృద్ధి ప్రతిపాదనలు తెస్తే ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు అయ్యేలా చూడతామని హామీ ఇచ్చారు.
సింగరేణి వల్ల కలిగే పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు కిష్టారం, సత్తుపల్లి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తెప్పించేలా సంబంధిత మంత్రులు, సింగరేణి అధికారులతో చర్చిస్తామని చెప్పారు. దీనికి అనుగుణంగా సమగ్ర రిపోర్టు సిద్ధం చేయాలని సూచించారు. సీతారామ ఎత్తిపోతల పథకం క్రింద యాతాలకుంట టన్నెల్ సహా మిగిలిన పనులు పూర్తయ్యేలా భూసేకరణ వేగవంతం చేస్తే రాబోయే జూన్ నాటికి గోదావరి జలాలను సత్తుపల్లికి తీసుకురావడం లక్ష్యమని వెల్లడించారు. వేంసూరు మండలానికి కృష్ణ జలాలతో పాటు గోదావరి జలాలు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తున్న నేపథ్యంలో కల్లూరుగూడెంలో మరో ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఆయిల్‌పామ్ ఉత్పత్తి పెరిగేందుకు తేనెటీగల పెంపకం ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.
చిన్నపిల్లలను ఆకర్షించేలా జంతువులు, వినోద సదుపాయాలను పార్కులో ఏర్పాటు చేస్తామని, దీనికి అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వ తరఫున అందజేస్తామని అన్నారు. రోడ్ల విస్తరణ ప్రణాళికలున్న ప్రాంతాల్లో చెట్లు దూరం పాటించి నాటాలని, విద్యుత్ తీగల కింద అనుకూలమైన మొక్కలతో వనరక్షణ చేపట్టాలని సూచించారు.
జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ఓపెన్ కాస్ట్ మైనింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలను తగ్గించేందుకు అర్బన్ పార్క్ అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అటవీ శాఖ కృషిని అభినందిస్తూ, నీలాద్రి అర్బన్ ఫారెస్ట్‌లో సృష్టించిన వన సంపదను శాశ్వతంగా కాపాడేందుకు సాంకేతికతను వినియోగిస్తామని తెలిపారు. ఫారెస్ట్ సంరక్షణ కోసం డ్రోన్ కెమెరాలు అందజేస్తామని, వెలుగు మట్ల, నీలాద్రి అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వీకెండ్స్‌లో పిల్లలు, కుటుంబాలు అధిక సంఖ్యలో పార్క్ సందర్శించేలా వసతులు కల్పిస్తే పార్క్ ఆదాయం పెరిగి నిర్వహణకు ఉపయోగపడుతుందని చెప్పారు. పార్కులో జంతువులు పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రతి నెలా ఎఫ్.పి.సి. కమిటీ సమావేశాలు నిర్వహించి చిన్న సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సిసిఎఫ్ భీమానాయక్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రం సింగ్, ఎస్ఎఫ్ఎస్ మంజుల, సింగరేణి జీఎం శాలెం రాజు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఫారెస్ట్ రేంజర్ స్నేహలత, ఏసీపీ రఘు, సీఐ శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ నరసింహ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలా రాణి తదితరులు పాల్గొన్నారు.





# ఎస్ఆర్ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు మేళా,పిఆర్ఏ సదస్సు

**ధర్మసాగర్,సెప్టెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని నర్సింగరావుపల్లి గ్రామంలో ఎస్ఆర్ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు మేళా(ఆర్ఏడబ్ల్యుఈపి), పిఆర్ఏ సదస్సు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామీణ వ్యవసాయ సమస్యలను అర్థం చేసుకోవడానికి, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి, మరియు కొత్త ఆవిష్కరణలను రైతులకు పరిచయం చేయడానికి ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రామ వనరులను గుర్తించి, రైతుల సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించారు. ఆధునిక వ్యవసాయ పరికరాలు, కొత్త విత్తన రకాలు, సంప్రదాయ సాంకేతిక పరిజ్ఞానం (ఐటికెఎస్) ప్రదర్శన ద్వారా రైతులకు నూతన అవగాహన కల్పించారు. ఇది వ్యవసాయ ఉత్పత్తి, నాణ్యమైన దిగుబడి, మరియు ఆధునిక పద్ధతుల వినియోగాన్ని పెంచే దిశగా సానుకూల చర్యగా ఉంది. విద్యార్థులైన జి.శివాని, జి.సంధ్యా, ఎస్.వాంగ్మయి, చి.అశ్రిత, ఏ.సహజ, పి.రిషిక గ్రామ పరిస్థితులను అంచనా వేసి, రైతులకు సూచనలు అందించడంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ జి.భూపాల్ రాజ్, డాక్టర్ జి.శ్రీకర్ రెడ్డి, డాక్టర్ రాథోడ్ లాల్ సింగ్, ముత శ్రావ్య, జి.హరీష్, డి.నిఖిల్ వంటి ప్రముఖులు హాజరై మార్గదర్శనం అందించారు. ఈ మేళా గ్రామ సమస్యలను పరిష్కరించడానికి, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా గ్రామాభివృద్ధికి ఒక కొత్త దిశను చూపిందని చెప్పవచ్చు.



# సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

**కాప్రా, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి గురువారం రోజున ఎన్ఆర్ఐ కాలనీ పరిధిలో రూ.56 లక్షల వ్యయంతో నూతన సి.సి. రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ - "వాసులకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చుతున్నాను. ఇప్పటికే మొదటి విడతలో రూ.56 లక్షల వ్యయంతో ప్రధాన రోడ్లను నిర్మించాం. రెండవ విడతలో కూడా అదే వ్యయంతో కొత్త రోడ్ల పనులు ప్రారంభించాం. మిగతా రోడ్ల పనులు త్వరలో చేపడతాం" అని అన్నారు. అలాగే రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో గ్రేటర్ హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ముఖ్యంగా కాప్రా డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తుందని తెలిపారు. ఎన్ఆర్ఐ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించి, "ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా అమలు చేస్తున్న శివమణి లాంటి నాయకులు అరుదు" అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ నాగేశ్వర్ రావు, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు, మేడ్చల్ జిల్లా ఏఎంసి మాజీ డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, నాయకులు పి. పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి, శ్రీధర్ రెడ్డి, తన్నీరు శ్రీహరి, సంతోష్ చారి, సురేందర్ రెడ్డి, సయ్యద్ మూర్తుజా తదితరులు పాల్గొన్నారు.





# పాఠశాల ప్రయోగశాలలు భవిష్యత్ శాస్త్రవేత్తల కర్మాగారాలు

**హనుమకొండ జిల్లా విద్యాధికారి వాసంతి.**

**ఎల్కతుర్తి,సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో అనే కందుకూరి వీరేశలింగం పంతులు సూక్తిని అవలంబిస్తూ భవిష్యత్తులో విద్యార్థులు మంచి పుస్తకాలు కొనే అలవాటు చేసుకోవాలని హనుమకొండ జిల్లా విద్యాధికారి వాసంతి అన్నారు. ఎల్కతుర్తి మండలం వల్బపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో దాతలు తాడూరి రమేష్, సత్యనారాయణ గ్రానైట్ వారి సహాయంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయం,ప్రయోగశాలను దాతలతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి అధ్యక్షత వహించగా హనుమకొండ డిఇఓ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కలిగిన ఒక మంచి గ్రంథాలయము ఏర్పాటు చేసినందుకు ప్రధానోపాధ్యాయుల్ని అభినందించారు. పాఠశాలలో ప్రతి తరగతికి ఒక పిరియడ్ ను కేటాయించి అమలు చేయాలని కోరారు. విద్యార్థుల స్థాయికి తగిన పుస్తకాలు ఎంచుకొని చదవాలని చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కాని ఒక మంచి పుస్తకం కొనుక్కో అనే కందుకూరి వీరేశలింగం పంతులు సూక్తిని ఉటంకిస్తూ విద్యార్థులు మంచి పుస్తకాలు కొనే అలవాటును చేసుకోవాలని అన్నారు.విరామ సమయంలో వ్యక్తికి పుస్తకాలే మంచి నేస్తాలు అని పాఠశాల ప్రయోగశాలలు విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథంను పెంచుతాయని తెలిపారు.ఉపాధ్యాయులు విధిగా పాఠ్య ప్రణాళికలో ఇచ్చిన ప్రయోగాలను చేయించాలని పాఠశాల ప్రయోగశాలలు భవిష్యత్ శాస్త్రవేత్తల కర్మాగారాలు అని ప్రయోగశాలల వలన విద్యార్థిలో శాస్త్రీయ ఆలోచన పెంచుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సత్యనారాయణ,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దుర్గా భవాని,పాఠశాల చైర్మన్ నీరజ,దాతలు తాడూరి రమేష్, భూమయ్య,రత్నాకర్, ప్రతాప్,రామారావు,ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి,వెంకటస్వామి,సుహాసిని,పద్మలత, కళ్యాణి, రమాదేవి,ప్రేమ్ ప్రసాద్ రావు,అఖిల తదితరులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

## పాండాల యాదగిరి గౌడ్

**దమ్మాయిగూడ, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మాయిగూడ ఓల్డ్ విలేజ్‌కు చెందిన సత్యనారాయణ వంశరాజ్ అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతి చెందిన వార్త తెలిసిన వెంటనే దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ భర్త పాండాల యాదగిరి గౌడ్ మృతుని నివాసానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా యాదగిరి గౌడ్ బాధిత కుటుంబానికి రూ.5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. "ఆకుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాను. ఏ అవసరం వచ్చినా నేను మీతో ఉంటాను" అని ఆయన భరోసా ఇచ్చారు.సామాజిక సేవలో ఎల్లప్పుడూ ముందుండే యాదగిరి గౌడ్ ఈ సందర్భంలో చూపిన మానవత్వాన్ని స్థానికులు అభినందించారు. దుఃఖ సమయాల్లో ప్రజలకు అండగా నిలవడం ద్వారా ఆయన తన సామాజిక బాధ్యతను మరొకసారి చాటుకున్నారని పలువురు వ్యాఖ్యానించారు.



# అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

**కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్**

**గౌతమ్ నగర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. మిర్జాలగూడ ప్రాంతంలో 10 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సి.సి. రోడ్డు నిర్మాణ పనులను ఆమె సర్కిల్ ఏఈ దివ్య జ్యోతి తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ – "ప్రజా సౌకర్యాల కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగించాలి. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదు. కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు. అభివృద్ధి పనులు సమయానికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచడమే మా లక్ష్యం" అని అన్నారు. కార్పొరేటర్ సూచనలతో అధికారులు రోడ్డు పనుల పురోగతిని వివరించారు. స్థానిక ప్రజలు కూడా అభివృద్ధి పనులను ప్రశంసిస్తూ, తమ సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు .ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మేకల రాము యాదవ్, పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్పొరేటర్ కు అభినందనలు తెలిపారు.

# ఏసీబీ వలలో కొత్తకోట రెవెన్యూ అధికారులు

**రూ.40 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆర్ఐ, సర్వేయర్**



**కొత్తకోట,సెప్టెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కొత్తకోట ఎమ్మార్వో కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ వాసు, సర్వేయర్ నవీన్‌రెడ్డి రూ.40 వేల లంచం స్వీకరిస్తూ పట్టుబడ్డారు.
సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు కార్యాలయంపై అకస్మాత్తుగా దాడి చేసి, ఇద్దరిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. లంచం స్వీకరణపై కేసు నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

# వర్షం వల్ల జలమయంలా మారిన నాలా మూసుకుపోయినా రోడ్లు



**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** గురువారం మల్కాజ్గిరి లో కురిసిన భారీ వర్షానికి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సరికొండ నరసింహ రెడ్డి కళ్యాణ మండపం వద్ద గల నాలా పక్కనే ఉన్న రోజువారీ డంపింగ్ యార్డు నుంచి చెత్త కుప్పలు వర్షపు ప్రవాహంలో ఇరుక్కుపోవడంతో నాలా మూసుకుపోయింది. ఫలితంగా వర్షపు నీరు రోడ్లపైకి చేరి, చెరువులు కూడా నిండిపోయాయి.
దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షపు నీటితో రహదారులు పూర్తిగా మునిగిపోవడంతో స్థానికులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఈ పరిస్థితిని గమనించిన మల్కాజ్గిరి మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్, రాజీవ్ గాంధీ నగర్ వాసులు ప్రదీప్, సతీష్, రాజు స్వయంగా అక్కడికి చేరుకొని చెత్త కుప్పలను తొలగించే పనిలో పాల్గొన్నారు. వారి కృషితో నీరు క్రమంగా కాలువల్లోకి వెళ్లేలా మార్గం సుగమమైంది.స్థానికులు మాట్లాడుతూ, "ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య ఎదురవుతోంది. మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదని" ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు ను పూర్తిగా తొలగించాలని, నాలాలపై శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.






# ఎంసిఆర్ హెచ్ఆర్డీలో దిశా కమిటీ సమావేశం

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్

**మేడ్చల్ మల్కాజిగిరి, సెప్టెంబర్ 18(తెలంగాణ ముచ్చట్లు):** ఎంసిఆర్ హెచ్ఆర్డీ ఆడిటోరియంలో జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పలు ప్రజా సమస్యలను లేవనెత్తారు. కేబుల్ వైర్ల కారణంగా ప్రాణ నష్టం జరగడంతో అధికారులు నగరంలో ఇంటర్నెట్ లైన్లు కట్ చేస్తున్నారని, దాంతో విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు ఇనుప స్తంభాలు తొలగించి, ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లు మార్చాలని సూచించారు.వర్షాలతో ఎన్నడూ మునిగిపోని కాలనీలు కూడా నీటమునుగుతున్నాయని, హైడ్రాతో సమన్వయం చేసి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కంటోన్మెంట్ పరిధిలోని విమాన నగర్‌లో 10 అడుగుల నీరు నిలిచిపోతుందని, దీన్ని ప్రత్యేక కేసు కింద పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అంగన్వాడీ కేంద్రాల దుస్థితి, టాయిలెట్స్ లేకపోవడం, పిల్లలు ఒకే గదిలో ఉండి వంట చేయడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూళ్లకు ఉన్నట్లే అంగన్వాడీలకు కూడా సెంట్రల్ కిచెన్ ద్వారా భోజనం పంపించేలా చూడాలని కోరారు.అలాగే వాజపేయి హయాంలో నిర్మించిన వాంబే హౌసెస్ కూలిపోతోన్న పరిస్థితి ఉందని, 14 కాలనీల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్షాల వల్ల రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. "ప్రభుత్వాలు మారవచ్చు కానీ అధికారులు మాత్రం ఒకేలా ఉంటారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బాధ్యతాయుతంగా పని చేయాలి. లేదంటే ప్రజలు మనపై నమ్మకం కోల్పోతారు" అని ఈటల రాజేందర్ హెచ్చరించారు.

# బిఓసిడబ్ల్యూ నిధులను దారి మళ్ళించొద్దు : సీఐటీయూ



**కీసర, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు) :** కీసర మండలంలోని దమ్మాయిగూడ చౌరస్తా వద్ద భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చింతకింది అశోక్ ముఖ్య అతిథిగా హాజరై కార్మికులతో కలసి నినాదాలు చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో ఉన్న బిఓసిడబ్ల్యూ నిధులను దుర్వినియోగం చేయకూడదని, ప్రైవేట్ వ్యక్తులకు లేదా సంస్థలకు ఇవ్వకుండా నేరుగా కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అడ్డా కార్మికులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ప్రతి అడ్డాలో సమగ్ర సర్వే నిర్వహించి కార్మికుల పేర్లు వెల్ఫేర్ బోర్డులో నమోదు చేయాలని, కార్మికులందరికీ హెల్త్ కార్డులు, లేబర్ కార్డులు అందజేయాలని కోరారు. అడ్డాల వద్ద షెడ్లు, త్రాగునీరు, మరుగుదొడ్లు, టాయిలెట్లు ఏర్పాటు చేసి, కార్మికులకు ఐదు రూపాయల భోజనం అందుబాటులో ఉంచాలని అన్నారు.55 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి పదివేల రూపాయల పెన్షన్ మంజూరు చేయాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని, అదేవిధంగా పట్టణ ఉపాధి పథకం ద్వారా సంవత్సరానికి కనీసం 200 రోజుల పని కల్పించాలన్నారు. కార్మిక శాఖ అధికారులు అడ్డాలపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ అందించాలని కూడా సూచించారు.ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు బంగారు నర్సింగరావు, బీసీడబ్ల్యూ నాయకులు రోషన్, రాజు, జంగయ్య, వెంకటయ్య, శ్రీనివాస్, యాదగిరి, నాగరాజు, మహిళా నాయకురాళ్లు యాదమ్మ, సోని తదితరులు పాల్గొన్నారు.

# నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహ ఆవిష్కరణ ఎంపీ ఈటెల, ఎమ్మెల్యే బండారి



**కాప్రా, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం కాప్రాలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.
ఈటల రాజేందర్ మాట్లాడుతూ—"ఈ పార్క్ చిన్నదైనా, ఇందులో ఏర్పాటు చేసిన నేతాజీ విగ్రహం గొప్పది. ఇది దేశభక్తి, కమిట్‌మెంట్‌కు నిదర్శనం. మహనీయుల విగ్రహాలను కేవలం దండ వేసుకోవడానికే కాదు, వారి చరిత్రను భావితరాలకు అందించడానికే ఏర్పాటు చేయాలి" అని అన్నారు. స్వాతంత్ర్యం కోసం లక్షలాది మంది పోరాడారని, అనేక మంది ప్రాణత్యాగాలు చేశారని ఆయన గుర్తుచేశారు. "సుభాష్ చంద్రబోస్ గొప్ప మేధావి. తన వ్యక్తిగత జీవితాన్ని పక్కన పెట్టి, భారత జాతి విముక్తి కోసం పోరాడారు. భారత్‌లో సాధ్యం కాకపోతే విదేశాలకు వెళ్లి ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి దేశం కోసం ప్రాణం అర్పించారు" అని ఈటల వివరించారు.భగత్ సింగ్, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి మహనీయుల త్యాగాలను ప్రస్తావించిన ఆయన— "పిల్లలకు దేశభక్తి నేర్పాలి. మన సంప్రదాయాలు, విలువలు వారసత్వంగా అందించాలి. ఈ విలువలే మన సమాజాన్ని చెడు మార్గాల నుండి కాపాడతాయి" అని సూచించారు.ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ—"ఎంపీగా ఉన్నప్పటి నుండి ఈటల రాజేందర్ నిరంతరం ప్రజల మధ్యే ఉంటున్నారు. ఈ ప్రాంతంలో రోడ్లు ధ్వంసం అయ్యాయి, వాటి మరమ్మతులకు, చెరువుల సంరక్షణకు నిధులు కేటాయించాలి" అని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, విద్యార్థులు, నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా భారత్ మాతా కీ జై నినాదాలతో సభ ముగిసింది.

# 70 లక్షల వ్యయంతో స్టార్మ్ వాటర్ డ్రైన్ పనుల పర్యవేక్షణ

**చిల్కానగర్, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్లోని బ్యాంక్ కాలనీలో సుమారు 70 లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనులను కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ – "బ్యాంక్ కాలనీ నుండి నిర్మిస్తున్న ఈ డ్రైన్ పైప్ లైన్ ద్వారా సుమారు 10 నుంచి 12 కాలనీల వర్షపు నీరు సులభంగా బయటకు వెళ్లేలా అవుతుంది. కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ముద్ధం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణగౌడ్, శ్యామ్, బంటీ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి గఫూర్, సెక్రటరీ సందీప్ భూషణ్, కాలనీ సభ్యులు వెంకటేశం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# రేజర్ల గ్రామ దేవతల ప్రతిష్ఠ మహోత్సవానికి ఆహ్వానం!

**మంత్రి తుమ్మలకు ఆహ్వాన పత్రికను అందజేసిన గ్రామ పెద్దలు.**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండల పరిధిలోని రేజర్ల గ్రామంలో విజయదశమి రోజున కనుల పండుగలా జరగనున్న గ్రామ దేవతల ప్రతిష్ఠ మహోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. దమ్మపేట మండలంలోని గండుగులపల్లి గ్రామంలో మంత్రి తుమ్మలను కలిసి రేజర్ల గ్రామస్థులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయదశమి రోజున గణపతి, సుబ్రహ్మణ్య పరివార దేవతల పూజలు, బొడ్రాయి ప్రతిష్ఠ వంటి ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయని మంత్రి తుమ్మలకు వివరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మహోత్సవానికి హాజరవుతానని గ్రామ పెద్దలకు తెలిపారు.



# రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

**పెద్దమందడి వ్యవసాయ అధికారి సైదులు**

**పెద్దమందడి,సెప్టెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** రైతులు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని పెద్దమందడి మండల వ్యవసాయ అధికారి సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.
మండల వ్యవసాయ అధికారి సైదులు మాట్లాడుతూ, రైతులు సబ్సిడీపై అందజేయబడుతున్న వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎస్ఎమ్ఏఎం పథకం-2025లో భాగంగా మండలానికి వచ్చిన మొదటి విడతలో రోటోవేటర్లు, బ్రష్ కట్టర్లు, కల్టీవేటర్లు/కేజ్ వీల్స్, విత్తన విత్తే యంత్రం, చేతి పంపులు, బ్యాటరీ పంపులు, పవర్ స్ప్రేయర్లు లాంటి పరికరాలు లభించనున్నాయని తెలిపారు. రైతులు వీటి కోసం సెప్టెంబర్ 20, 2025 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు ఫారం నింపి, పట్టాదార్ పాస్ బుక్ మరియు ఆధార్ కార్డు జతచేసి, సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారులకు (ఏఈఓ) అందజేయాలని అన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# 'బీమా సుగమ్' పోర్టల్‌ను ప్రారంభించిన ఐఆర్‌డీఏఐ




దేశీయ బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'బీమా సుగమ్' పోర్టల్‌ను ప్రారంభించినట్టు బుధవారం అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతానికి ఇది పూర్తిగా అందుబాటులోకి రానప్పటికీ, ఈ సంవత్సరం డిసెంబర్‌లో ప్లాట్‌ఫామ్ మొదటి దశ లైవ్‌లోకి వస్తుందని సమాచారం. ఈ పోర్టల్ అందుబాటులోకి వస్తే అన్ని రకాల బీమా పాలసీలు ఒకే ప్లాట్‌ఫామ్‌లో లభిస్తాయి. వివిధ బీమా కంపెనీలు అందించే అన్ని పాలసీలను ఒక దగ్గరే చెక్ చేసుకుని, ఏది సరసమైన ధరకు లభిస్తుందో దాన్ని ఎంచుకునే వీలుంటుంది. ఈ ప్లాట్‌ఫామ్‌లో లభించే ఫీచర్లను దశల వారీగా అందుబాటులోకి తీసుకురానున్నారు. రానున్న రోజుల్లో ఐఆర్‌డీఏఐ బోర్డు ఆమోదించిన దానికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలు, ఇతర భాగస్వామ్య సప్తులు బీమా సుగమ్‌లో పాలసీలను అందుబాటులోకి తీసుకురానున్నాయి. ముఖ్యంగా ఈ ప్లాట్‌ఫామ్‌లో కస్టమర్లు, ఇన్సూరెన్స్ కంపెనీలు, ఇన్సూరెన్స్ ఏజెంట్లు, మధ్యవర్తులు అందరికీ అవసరమైన అన్ని రకాల బీమా సేవలు లభిస్తాయి. జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్, లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నడిచే ఈ పోర్టల్ బీమా రంగంలో పారదర్శకత, సమగ్రతను పెంచేందుకు ఉపయోగపడుతుంది. ఈ ప్లాట్‌ఫామ్ నుంచి పాలసీ కావాలనుకునే వారు సులభంగా కొనుగోలు చేయవచ్చు. అంతేకాకుండా పాలసీ రెన్యూవల్, క్లెయిమ్ సెటిల్‌మెంట్ వంటి పనులను సులభంగా పూర్తి చేయవచు.

# ప్రపంచ స్థాయిలో భారత దేశ ప్రతిష్టను పెంచిన వ్యక్తి మోదీ



**నాచారం, సెప్టెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవ పక్షం కార్యక్రమంలో భాగంగా నాచారం డివిజన్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీజేవైఎం డివిజన్ వైస్ ప్రెసిడెంట్ నడిగోటి బాలకృష్ణ ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవి నాయక్ మాట్లాడుతూ, "ప్రపంచంలో భారత దేశ ప్రతిష్టను అగ్రస్థానానికి తీసుకెళ్లిన వ్యక్తి మోదీ" అని ప్రశంసించారు. మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా పక్షం రోజుల పాటు వివిధ సేవా. ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బీజేపీ నేతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొమ్మగల నవీన్ కుమార్, కార్పొరేటర్ కంటెస్టెంట్ అనిత పద్మా రెడ్డి, బెక్కరి రవీందర్ రెడ్డి, మల్కా ప్రకాష్, రవికాంత్ నాయుడు, కాటేపల్లి రవీందర్ రెడ్డి, దయానంద గౌడ్, ఉదయ్ కిరణ్ రెడ్డి, పాదం వెంకటేష్, వెంకట్ నాయక్, దర్శనాల వెంకటేష్, రాజిరెడ్డి, ఆనంద కుమార్, సురేందర్ స్వామి, వెంకటేశ్వర్లు, కిషోర్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# 2040 నాటికి ఏఐ ద్వారా 40 శాతానికి ప్రపంచ వాణిజ్యం




2040 నాటికి కృత్రిమ మేధస్సు (ఏఐ) కారణంగా దేశాల మధ్య వాణిజ్య విలువ దాదాపు 40 శాతం పెరుగుతుందని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) తెలిపింది. ఉత్పాదకత పెరుగుదల, తక్కువ వాణిజ్య ఖర్చుల ద్వారా ఇది పెరిగేందుకు దోహదపడుతుందని బుధవారం విడుదల చేసిన ప్రపంచ వాణిజ్య నివేదిక 2025 ఎడిషన్‌లో పేర్కొంది. అయితే, ఏఐ, వాణిజ్యం రెండూ వృద్ధికి దోహదపడాలంటే, డిజిటల్ అంతరాన్ని తగ్గించడానికి, శ్రామిక శక్తి నైపుణ్యాలలో పెట్టుబడులకు, సానుకూల పెట్టుబడుల వాతావరణం కొనసాగే విధానాలు అమలులో ఉండాలి అని నివేదిక అభిప్రాయపడిరది. వాణిజ్య ఖర్చులను తగ్గించడానికి, ఉత్పాదకతను పెంచేందుకు ఏఐకి అపారమైన సామర్థ్యం ఉంది. అయితే, ఏఐ సాంకేతికతలకున్న యాక్సెస్, డిజిటల్ వాణిజ్యంలో చొచ్చుకుపోవడంలో వ్యత్యాసం అధికంగా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ న్గోజీ ఒకోంజోఇవేలా అన్నారు. నివేదిక ప్రకారం, 2040 నాటికి ఏఐ వాణిజ్యం, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) గణనీయంగా పెరిగేందుకు అవకాశం ఉంది. తక్కువ, మధ్య, అధిక ఆదాయ దేశాల మధ్య వివిధ స్థాయిలలో పాలసీలు, సాంకేతికత ఆధారంగా ప్రపంచ వాణిజ్యం 3437 శాతం మేర పెరుగుతుందని అంచనా. తక్కువ, మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థలు అధికఆదాయ ఆర్థిక వ్యవస్థలతో తమ డిజిటల్ మౌలిక సదుపాయాల అంతరాన్ని 50 శాతం తగ్గించుకుని, ఏఐని మరింత విస్తృతంగా వినియోగిస్తే, ఈ ఆర్థిక వ్యవస్థల (తక్కువ, మధ్య దేశాల) ఆదాయాలు వరుసగా 15 శాతం, 14 శాతం పెరుగుతాయని నివేదిక పేర్కొంది.

# పెట్రోలియం రిజర్వుల్లోకి ఎంఇఐఎల్ ప్రవేశం

మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) కొత్తగా వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వు (ఎస్‌పిఆర్)లోకి ప్రవేశించింది. ప్రయివేటు రంగంలోని ఓ కంపెనీ ఈ రంగంలో ప్రవేశించడం, భారీగా పెట్టుబడులు పెట్టడం ఇదే తొలిసారి అని తెలుస్తోంది. కర్నాటకలోని పాదుర్‌లో రూ.5,700 కోట్ల వ్యయంతో ఎస్‌పిఆర్ యూనిట్‌ను నిర్మించనున్నట్లు వెల్లడిరచింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా 2.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఎస్‌పిఆర్‌ను నిర్మించాలని నిర్దేశించుకుంది. ఇది భారతదేశం అత్యవసర ముడి చమురు నిల్వలకు గణనీయంగా దోహదపడుతుందని ఆ వర్గాలు భావిస్తున్నాయి. దేశంలో ప్రస్తుతం విశాఖపట్నం, మంగళూరు, పదూర్‌లో ఎస్‌పిఆర్‌లు ఉన్నాయి. వీటిల్లోని నిల్వలు ప్రస్తుతం దేశ అవసరాలను 89 రోజుల డిమాండ్‌ను తీర్చగలవు. ఎంఇఐఎల్ యూనిట్ అందుబాటులోకి వస్తే ఇది మరింత పెరగనుంది. ప్రపంచ సరఫరా అంతరాయాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు లేదా ఊహించని డిమాండ్ పెరిగినా దేశ ఇంధన బఫర్‌కు తోడ్పడనుంది. ఈ రిజర్వ్‌ను నిర్మించడానికి ఎంఇఐఎల్‌కు ఐదేండ్లు సమయం పడుతుంది.

MEIL
MEGHA ENGINEERING & INFRASTRUCTURES LIMITED

# తక్షణ అవసరాలకు 'యూపీఐ క్రెడిట్ లైన్' సదుపాయం ప్రారంభించిన పేటీఎం





ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ పేటీఎం తన కస్టమర్లకు ప్రత్యేక యూపీఐ క్రెడిట్ లైన్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. సూర్యోదయ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకుతో భాగస్వామ్యం ద్వారా 'పేటీఎం పోస్ట్‌పెయిడ్'ను ప్రారంభించింది. దీని ద్వారా వినియోగదారులు ఏదైనా అవసరానికి తక్షణ చెల్లింపులు చేయవచ్చు. 'ఇప్పుడు ఖర్చు చేయండి, వచ్చే నెలలో చెల్లించండి' అనే ట్యాగ్‌లైన్‌తో పేటీఎం పోస్ట్‌పెయిడ్ ఉపయోగించి వినియోగదారులు 30 రోజుల వరకు వడ్డీ లేని క్రెడిట్‌ను పొందవచ్చు. ఇది రోజువారీ ఖర్చులకు ఉపయోగపడుతుంది. వినియోగదారులు కేవైసీ పూర్తి చేసి, వారి యూపీఐ ఖాతాను సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌తో లింక్ చేసి, యూపీఐ పిన్‌ను సెటప్ చేయడం ద్వారా పేటీఎం యాప్ నుంచి నేరుగా పేటీఎం పోస్ట్‌పెయిడ్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. ఈ డిజిటల్ క్రెడిట్ లైన్ రూ. 60,000 వరకు ప్రీఅప్రూవ్డ్ క్రెడిట్ పొందుతారు. దీనికి నెలరోజుల పరిమితి ఉంటుంది. ఈ రుణాన్ని షాపింగ్, బిల్లుల చెల్లింపులు, రీఛార్జ్‌లు, బుకింగ్‌లు వంటి వివిధ ప్రయోజనాల కోసం ఉపయోగించవచ్చు. వినియోగదారులకు 30 రోజుల వడ్డీ లేకుండా వాడుకుని, తిరిగి చెల్లించే సదుపాయం ఉంటుంది. ఖర్చు చేసిన మొత్తానికి మాత్రమే నామమాత్రపు ఛార్జీలు వర్తిస్తాయి. అయితే, ఈ క్రెడిట్ సదుపాయాన్ని ఉపయోగించి పర్సన్ టూ పర్సన్(పీ2పీ) లావాదేవీలు చేసే అవకాశం ఉండదు.

# బ్యాంకులు, బీమా సంస్థల పెట్టుబడులను అనుమతించే దిశగా సెబీ




క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. నాన్‌క్యాష్, నాన్‌అగ్రికల్చర్ కమోడిటీ డెరివేటివ్ మార్కెట్లలో బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, పెన్షన్ ఫండ్స్ పెట్టుబడులను అనుమతించాలని యోచిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని చూస్తున్నట్టు బుధవారం సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. కాగా, నాన్‌క్యాష్ సెటిల్డ్, నాన్‌అగ్రికల్చరల్ కమోడిటీ డెరివేటివ్ కాంట్రాక్టుల్లో ట్రేడిరగ్‌కు ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీవో)ను అనుమతించాలన్న ప్రతిపాదననూ పరిశీలిస్తున్నట్టు ఇక్కడ ఎంసీఎక్స్ నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన చెప్పారు. ఆర్థిక వ్యవస్థలో కమోడిటీ డెరివేటివ్ మార్కెట్లు కీలకపాత్ర పోషిస్తాయన్న పాండే.. ప్రపంచ స్థాయిలో ధరలను అనుసరించే స్థాయి నుంచి ఆ ధరలను నిర్ణయించే స్థాయికి భారత్ ఎదగాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. ఇక డిసెంబర్‌కల్లా కాంప్లియెన్స్ రిపోర్టుల కోసం కామన్ రిపోర్టింగ్ మెకానిజంలో కమోడిటీస్పెసిఫిక్ బ్రోకర్లనూ సమ్మిళితం చేయనున్నట్టు పాండే ఈ సందర్భంగా తెలియజేశారు.

# జీఎస్టీ కోతలతో ప్రజల చేతుల్లో రూ. 2 లక్షల కోట్ల నగదు



వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణల ద్వారా ప్రజల చేతుల్లోకి రూ. 2 లక్షల కోట్లు చేరుతాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దీనివల్ల ప్రజల చేతిలో ఎక్కువ నగదు ఉంటుందని, అది విచక్షణతో కూడిన ఖర్చుకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. బుధవారం విశాఖపట్నంలో జీఎస్టీ సంస్కరణలపై జరిగిన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. 99 శాతం వస్తువులు ఇప్పుడు 5 శాతం జీఎస్టీ శ్లాబు కిందకు వచ్చాయి, ఇది మధ్య తరగతి, పేదలకు ఎంతో ప్రయోజనం. దేశంలోని 140 కోట్ల మందికి వర్తించేలా అతిపెద్ద నిర్ణయం తీసుకున్నాం. ఇప్పటికే చాలా రంగాలకు జీఎస్టీ ప్రయోజనాలు అందాయి. 4 శ్లాబులను రెండిరటికి తగ్గించాం. 28 శాతం శ్లాబులో ఉన్న సిమెంట్ సహా 90 శాతం వస్తువులను 18 శాతానికి తీసుకొచ్చాం. వినియోగదారులపై పన్ను భారాన్ని తగ్గించడం, ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య లభ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడిరచారు. 2018లో జీఎస్టీ ఆదాయం రూ.7.19 లక్షల కోట్లు వచ్చాయి, అది 2025 నాటికి రూ.22.08 లక్షల కోట్లకు పెరిగిందని సీతారామన్ అన్నారు. పన్ను చెల్లింపుదారుల సంఖ్య 65 లక్షల నుంచి 1.51 కోట్లకు పెరిగిందన్నారు. ఆత్మనిర్భర భారత్‌కు ఈ జీఎస్టీ కొత్త సంస్కరణలు ఊతంగ మారుతాయని, మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శానిటరీ న్యాప్‌కిన్స్‌పై కూడా పన్నును తొలగించాం. యూపీఏ ప్రభుత్వం 30 శాతం ఉన్న వస్తువులను 5 శాతం పరిధిలోకి తీసుకొచ్చామని, అయినా వారు తమనే విమర్శిస్తున్నారని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

# యెస్ బ్యాంక్‌లో 13.18% వాటా విక్రయించిన ఎస్‌బీఐ

యెస్‌బ్యాంక్‌లో 13.18% వాటాను జపాన్ సంస్థ ఎస్ఎంబీసీకు విక్రయించడాన్ని పూర్తిచేసినట్లు ఎస్‌బీఐ బుధవారం ప్రకటించింది. ఈ లావాదేవీ విలువ రూ.8,888.97 కోట్లు. సుమిటోమో మిత్సుయ్ ఫైనాన్షియల్ గ్రూప్‌కు చెందిన ఆర్థిక సేవల విభాగమైన ఎస్ఎంబీసీ నుంచి ఈ మొత్తాన్ని అందుకున్నట్లు ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఎస్‌బీఐ పేర్కొంది. యెస్‌బ్యాంకులో రూ.688 కోట్ల విలువైన వాటాలను ఎస్ఎంబీసీకి ఫెడరల్ బ్యాంక్, బంధన్ బ్యాంక్ విక్రయించాయి. యెస్ బ్యాంక్‌లో 15.39 కోట్ల షేర్లను ఎస్ఎంబీసీకి రూ.331 కోట్లకు బంధన్ బ్యాంక్ విక్రయించింది. దీంతో యెస్ బ్యాంక్‌లో బంధన్ బ్యాంక్ వాటా 0.7% నుంచి 0.21 శాతానికి తగ్గింది. ఒక్కో షేరు రూ.21.50 చొప్పున 16.62 కోట్ల యెస్ బ్యాంక్ షేర్లను రూ.357 కోట్లకు ఫెడరల్ బ్యాంక్ విక్రయించింది. రూ.176 లక్షల కోట్ల ఆస్తులు: భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న అగ్రగామి విదేశీ బ్యాంకుల్లో ఎస్ఎంఎఫ్‌జీ ఒకటి. జపాన్‌లో ఇది రెండో అతిపెద్ద బ్యాంకింగ్ గ్రూప్‌గా ఉంది. ఈ సంస్థ చేతిలో అంతర్జాతీయంగా 2 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.176 లక్షల కోట్ల) ఆస్తులు ఉన్నాయి. ఇప్పుడీ బ్యాంక్ చేతికి యెస్‌బ్యాంకులో 14% వరకు లభించింది. 2020లో పునర్వ్యవస్థీకరణ తర్వాత యెస్ బ్యాంక్‌లో అతిపెద్ద వాటాదారుగా ఎస్‌బీఐ మారింది. అనంతరం 2020 జులైలో యెస్ బ్యాంక్ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్‌లో భాగంగా అదనపు షేర్లను ఎస్‌బీఐ కొనుగోలు చేసింది. తాజా వాటా విక్రయం తర్వాత కూడా యెస్ బ్యాంక్‌లో 10.8% వాటాను ఎస్‌బీఐ కలిగి ఉంది. భారత బ్యాంకింగ్ రంగంలో ఇదే అతిపెద్ద సీమాంతర పెట్టుబడి కావడం విశేషం. ఈ లావాదేవీకి రిజర్వ్ బ్యాంక్, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా సహా అన్ని నియంత్రణ సంస్థల అనుమతులు లభించాయి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# బెల్లం, బ్రౌన్ షుగర్.. బెస్ట్ ఆప్షన్ ఏది





మధుమేహం, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న నేటి కాలంలో, ప్రజలు తమ ఆహారపు అలవాట్ల పట్ల మరింత శ్రద్ధ చూపుతున్నారు. శుద్ధి చేసిన తెల్ల చక్కెరను తగ్గించి, ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలనే ధోరణి పెరుగుతోంది. ఈ ప్రత్యామ్నాయాలలో బెల్లం పొడి, బ్రౌన్ షుగర్ ప్రముఖమైనవి.రెండూ ఒకే విధంగా కనిపించినా, తీపిని అందించినా, వాటి తయారీ విధానం, పోషక విలువలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం వేర్వేరుగా ఉంటాయి. ఈ తేడాలను అర్థం చేసుకోవడం ద్వారా సరైన ఎంపిక చేసుకోవచ్చు. బెల్లం పొడి.. చెరకు రసం లేదా తాటి రసం నుండి తయారుచేసిన సహజ స్వీటెనర్. దీనిని రసాయనికంగా శుద్ధి చేయరు. కాబట్టి ఐరన్, మెగ్నీషియం, పొటాషియం వంటి అనేక పోషకాలు అలాగే ఉంటాయి. దీనికి కొద్దిగా మట్టి రుచి ఉంటుంది. ఇది సాధారణంగా మన వంటకాలు, స్వీట్లు, టీలలో ఉపయోగిస్తారు. బ్రౌన్ షుగర్ అనేది తెల్ల చక్కెర, బెల్లం పాకంతో (మొలాసిస్) కలిపిన మిశ్రమం. మొలాసిస్ వల్ల దీనికి తేలికపాటి క్యారమెల్ రుచి వస్తుంది. ఇది తెల్ల చక్కెర కంటే తక్కువ శుద్ధి చేసినప్పటికీ.. బెల్లం పొడిలా ఎక్కువ పోషకాలు ఇందులో ఉండవు. బెల్లం పొడిలో తక్కువ మొత్తంలో ఐరన్, కాల్షియం, ఫాస్ఫరస్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. బ్రౌన్ షుగర్ ఎక్కువగా ఖాళీ కేలరీలను అందిస్తుంది. మొలాసిస్ నుండి చాలా తక్కువ ఖనిజాలు మాత్రమే లభిస్తాయి. తీపితో పాటు అదనపు పోషణ కావాలంటే బెల్లం పొడి మంచి ఎంపిక. బెల్లం పొడి గానీ, బ్రౌన్ షుగర్ గానీ బరువు తగ్గడానికి మ్యాజిక్ సొల్యూషన్ కాదు. రెండిరటిలోనూ కేలరీలు అధికంగా ఉంటాయి. కాబట్టి మితంగా తీసుకోవాలి. బ్రౌన్ షుగర్ తో పోల్చితే- బరువు తగ్గాలనుకునే వారికి ఇది కొద్దిగా బెటర్ ఆప్షన్ అన్నమాట. మీరు పోషకాలు ఎక్కువగా ఉండే సహజ స్వీటెనర్ కావాలంటే బెల్లం పొడిని ఎంచుకోండి. బేకింగ్ లేదా డెజర్ట్‌ల కోసం రుచిని ఇష్టపడితే బ్రౌన్ షుగర్‌ను ఎంచుకోవచ్చు. శుద్ధి చేసిన తెల్ల చక్కెర కంటే బెల్లం పొడి, బ్రౌన్ షుగర్ రెండూ మెరుగైనవే. బెల్లం పొడిలో ఎక్కువ పోషకాలు ఉంటాయి. ఆరోగ్యకరమైన జీవనశైలిని కోరుకునే వారు జగ్గేరి పౌడర్ ను ఎంచుకోవడం ఉత్తమం.

# ఉదయం లేవగానే టీ తాగుతున్నారా?

మీలో చాలామందికి ఉదయం నిద్ర లేవగానే ఒక వేడి వేడి కప్పు టీ తాగే అలవాటు ఉంటుంది కదా? కానీ, ఈ అలవాటు మన ఆరోగ్యానికి చాలా నష్టం కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఖాళీ కడుపుతో నేరుగా టీ తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇది మీ జీర్ణవ్యవస్థను, జీవక్రియను దెబ్బతీస్తుంది, అసిడిటీ సమస్యలను పెంచుతుంది.అయితే, ఈ సమస్యకు ఒక సులభమైన పరిష్కారం ఉంది. అదేంటంటే... టీ తాగే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగడం. ఇలా చేయడం వల్ల టీలో ఉండే కెఫిన్ ప్రభావం శరీరంలో తగ్గుతుంది. అంతేకాకుండా, ఇది కడుపులోని ఆమ్లాన్ని పలుచబరిచి, టీ వల్ల వచ్చే కడుపు మంట, అసిడిటీ వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. కాబట్టి, రోజూ ఉదయం టీ తాగే అలవాటు ఉన్నవారు ఖచ్చితంగా ఈ చిట్కా పాటించడం మంచిది.టీ అనేది మంచి శక్తిని ఇచ్చే పానీయం. అయితే, దానిని సరైన పద్ధతిలో తీసుకోవడం చాలా ముఖ్యం. టీ తాగే ముందు నీరు తాగడం వల్ల కలిగే మరో ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే, ఇది మన శరీరంలో అసిడిటీని నియంత్రిస్తుంది. ఇది ముఖ్యంగా అసిడిటీ సమస్యలతో బాధపడేవారికి ఎంతో మేలు చేస్తుంది. ఇలా చేయడం వల్ల టీలోని కొన్ని పదార్థాలు కడుపులో ప్రతికూల ప్రభావాన్ని చూపకుండా సహాయపడతాయి. కాబట్టి, ఇకపై మీరు టీ తాగడానికి ముందు ఒక గ్లాసు నీరు తాగడాన్ని ఒక అలవాటుగా చేసుకోండి. ఈ చిన్న మార్పు మీ జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మీ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఉదయాన్నే ఆరోగ్యకరమైన అలవాటుతో మీ రోజును మొదలు పెట్టండి!



# కిడ్నీలు పాడైపోయినప్పుడు కనిపించే లక్షణాలు



శరీరంలో పేరుకున్న వ్యర్థాలను సరైన విధంగా బయటకు పంపించడంలో లివర్ తరవాత కిడ్నీలదే కీలక పాత్ర. యూరిన్ ద్వారా మురికిని బయటకు పంపేస్తాయి మూత్ర పిండాలు.అంతే కాదు. రక్తాన్ని శుద్ధి చేయడంలోనూ, నీటి నిల్వను నియంత్రించడంలోనూ కిడ్నీలు ఎంతో బాగా పని చేస్తాయి. అయితే.. కొన్ని సార్లు ఈ పని తీరులో మార్పులు చూస్తారు. అందుకు ముఖ్య కారణం ఇవి దెబ్బ తినడం. ఎప్పుడైతే కిడ్నీలు దెబ్బ తింటాయో అప్పటి నుంచి టాక్సిన్స్ బాడీలో పేరుకుపోతాయి. సరైన విధంగా మురికి బయటకు వెళ్లిపోదు. ఫలితంగా రకరకాల సమస్యలు వస్తాయి. కిడ్నీలు దెబ్బ తిన్నప్పుడు ప్రాథమికంగా కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని సరైన విధంగా గమనించకపోతే సమస్య తీవ్రమవుతుంది. మరి ప్రాథమికంగా కనిపించే ఆ లక్షణాలేంటి. ఎలా వాటిని గుర్తించాలో తెలుసుకోండి.

ఇందాకే చెప్పుకున్నట్టుగా కిడ్నీలు రక్తాన్ని ఫిల్టర్ చేసి, టాక్సిన్స్ ని బయటకు పంపుతాయి. వీటి పనే అది. ఎప్పుడైతే ఇందుకు అంతరాయం కలుగుతుందో అప్పుడే కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని మెడికల్ పరిభాషలో చెబుతుంటారు. నిజానికి కిడ్నీలు ఉన్నట్టుండి పాడైపోవు. అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, లైఫ్ స్టైల్ సరిగా లేకపోవడం, మసాలా ఫుడ్స్ అతిగా తినడం లాంటి కారణాల వల్ల మూత్రపిండాల పని తీరుపై ప్రభావం పడుతుంది. అధికంగా సాల్ట్, ప్రొటీన్ తీసుకున్నా ఇవే ఇబ్బందులు వస్తాయి. అయితే ఇంకొంత మంది విపరీతంగా స్మోకింగ్, డ్రిరకింగ్ చేస్తుంటారు. వీటి వల్ల కిడ్నీలు చాలా త్వరగా డ్యామేజ్ అవుతాయి. ఇక నిద్రలేమి సమస్య కూడా కిడ్నీ డ్యామేజ్ కి దారి తీస్తుంది. సింపుల్ గా చెప్పాలంటే..ఇదో సైలెంట్ కిల్లర్. ఇక బీపీ, షుగర్ లాంటి వాటి కోసం మెడిసిన్ ఎక్కువ కాలం పాటు తీసుకోవడం వల్ల కూడా కిడ్నీలు దెబ్బ తినే ముప్పు ఉంటుంది. కిడ్నీలో రాళ్లు వస్తాయి.

కిడ్నీలు పాడైపోయినప్పుడు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని సరైన విధంగా, సరైన సమయానికి గుర్తిస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా సమస్యల నుంచి బయటపడవచ్చు. ఇందులో ముఖ్యంగా కనిపించే మొట్టమొదటి లక్షణం ఏంటంటే..తరచూ యూరిన్ రావడం. ఎక్కువ సార్లు మూత్రం రావడం కిడ్నీలు పాడైపోయాయనడానికి సంకేతం. ముఖ్యంగా రాత్రి పూట తరచూ యూరినేషన్ వస్తుంది. ఇక మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. అంతకు ముందు రోజులతో పోల్చి చూస్తే మూత్రం చాలా తక్కువ క్వాంటిటీలో వస్తుంది. ఇది కూడా కిడ్నీ డ్యామేజ్ కి సంకేతమే. మూత్రంలో ఎక్కువగా నురగ, మరీ పసుపు పచ్చగా రావడం, రక్తం కనిపించడం లాంటి లక్షణాలు కూడా కిడ్నీలు పాడైపోయాయి అనడానికి సంకేతాలే. కిడ్నీలు సరైన విధంగా పని చేయకపోతే శరీరంలో మలినాలు పేరుకుంటాయి. ఇవి బయటకు వెళ్లకపోతే ఎన్నో సమస్యలు వస్తాయి. ముఖ్యంగా జీర్ణ సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ఎప్పుడైతే మూత్ర పిండాలు సరిగ్గా పని చేయవో అప్పుడు బాడీలో టాక్సిన్స్ పెరుగుతాయి. ఇవి నేరుగా జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపిస్తాయి. తరచూ వాంతులు, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు కనబడతాయి. అంత కన్నా ముఖ్యంగా కనిపించే లక్షణం ఏంటంటే.. మలబద్ధకం. ఒక్కసారి ఈ సమస్య మొదలైందంటే..అంత సులభంగా తగ్గదు. పైగా మలబద్ధకం కారణంగా ఇతరత్రా అనారోగ్యాలు కూడా తలెత్తుతాయి. ఇక మరో ముఖ్యమైన లక్షణం ఏంటంటే.. ఎప్పుడైతే కిడ్నీలు సరిగ్గా పని చేయవో అప్పుడు బాడీలో ఉన్న అదనపు నీరు, ఉప్పు బయటకు వెళ్లడానికి వీలుండదు. సోడియం పెరిగే కొద్దీ అది కండరాల్లోకి చేరుకుంటుంది. ఎక్కువ రోజుల పాటు అలాగే నిల్వ ఉండడం వల్ల వాపులు వస్తాయి. ముఖ్యంగా చేతులు, కాళ్లలో ఈ వాపు కనిపించవచ్చు. ఉదయం పూట ఈ లక్షణం ఎక్కువగా కనబడుతుంది.

కిడ్నీలు పాడైపోయినప్పుడు కనిపించే మరో లక్షణం విపరీతమైన నీరసం. సాధారణంగా మూత్ర పిండాలు ఎరిత్రోపోయిటిన్ అనే హార్మోన్ ని ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది. ఇది ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేసేందుకు ఉపయోగపడే హార్మోన్. ఎప్పుడైతే కిడ్నీల పని తీరుపై ప్రభావం పడుతుందో అప్పుడు ఈ హార్మోన్ ఉత్పత్తి కాదు. ఫలితంగా..ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది. ఇదే క్రమంగా అనీమియాకి దారి తీస్తుంది. అంటే..హిమోగ్లోబిన్ తగ్గిపోతుంది. ఎప్పుడైతే రక్తం తగ్గిపోతుందో అప్పుడు విపరీతంగా నీరసపడిపోతారు. చాలా మంది దీన్ని మామూలు నీరసంగానే చూస్తారు. కానీ..ఇలా తరచూ నీరసంగా అనిపిస్తోంది అంటే తప్పనిసరిగా అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంటుంది. కిడ్నీలు పాడైపోయినప్పుడు వెన్ను నొప్పి కూడా వస్తుంది. కిడ్నీలో రాళ్లు రావడం, ఇన్ఫెక్షన్ , ఇన్ ఫ్లమేషన్ కారణంగా ఇలా విపరీతంగా నొప్పి వస్తుంది. మూత్రంలో కూడా మార్పు వస్తే అప్పుడు వైద్యుడిని సంప్రదించడం అవసరం.

# కలబంద జ్యూస్ తాగితే ఊహాకందని ఉపయోగాలు..!

కలబంద జ్యూస్ తాగడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. ప్రతిరోజూ దీనిని తాగేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం కూడా తప్పనిసరి. వచ్చేది శీతాకాలం సీజనల్ వ్యాధులకు ఎక్కువ అవకాశం ఉంటుంది. అందుకే శీతాకాలంలో కలబంద రసం అనేక ప్రయోజనాలను అందిస్తుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కలబందలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, శోథ నిరోధక లక్షణాలు ఉంటాయి. ఈ రసం జీర్ణక్రియను మెరుగుపరచడంలో, చర్మాన్ని మెరుగుపరచడంలో, రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: కలబందలో కొవ్వులు, చక్కెరలను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడే ఎంజైమ్‌లు ఉంటాయి. దీని వినియోగం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. దీని రసంలో మలబద్ధకం నుండి ఉపశమనం కలిగించే భేదిమందు లక్షణాలు ఉన్నాయి. రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది: కలబంద మధుమేహ రోగులలో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. కలబంద రసం రక్తంలో చక్కెరను తగ్గించడంలో, కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడంలో సహాయపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. కలబందలోని క్రియాశీల పదార్థాలు అధిక రక్తపోటును తగ్గించడంలో కూడా సహాయపడతాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: కలబంద రసం తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. దీని రసంలో విటమిన్లు (సి, ఇ, బి), ఖనిజాలు (కాల్షియం, మెగ్నీషియం, జింక్) ఉంటాయి. ఇవి మొత్తం ఆరోగ్యానికి, రోగనిరోధక వ్యవస్థకు ముఖ్యమైనవి. చర్మానికి మేలు చేస్తుంది: కలబంద రసం చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది, స్థితిస్థాపకతను పెంచుతుంది. ముడతలను తగ్గిస్తుంది. దీని శోథ నిరోధక, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు మొటిమలతో పోరాడటానికి, చర్మపు మంటను తగ్గించడంలో సహాయపడతాయి. మలబద్ధకం: కలబందలోని భేదిమందు లక్షణాలు, ఆంత్రాక్వినోన్ కడుపు సంబంధిత వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. ఇవి ప్రేగులలో మంచి బ్యాక్టీరియాను సక్రియం చేస్తాయి. మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడతాయి.



# చపాతీ తినడం మానేస్తున్నారా..?



గోధుమ పిండితో చేసే వంటకాలు చాలా మందికి సాధారణ ఆహారం, కానీ గోధుమ పిండి ఆరోగ్యానికి హానికరం అని కొందరు అంటుంటారు. కానీ ఇది ఎంతవరకు నిజం..? రోజూ చపాతీలు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయా..? భారతీయ వంటకాల్లో చపాతీ చాలా ముఖ్యమైనది. చాలా మంది రోజులో ఒక్కసారైనా చపాతీ తింటారు. కానీ ఇటీవల కాలంలో ఫిట్‌నెస్ విషయంలో శ్రద్ధ పెరిగిన చాలామంది ప్రజలు చపాతీ తినడం మానేస్తున్నారు. గోధుమల్లో గ్లూటెన్ అనే పదార్థం ఉంటుందని, ఇది ఆరోగ్యానికి హానికరమని కొందరు భావిస్తున్నారు. చపాతీ తినడం వల్ల బరువు పెరుగుతుందని, షుగర్ లెవెల్స్ పెరుగుతాయని కూడా నమ్ముతున్నారు. అయితే నిజంగా చపాతీ తినడం హానికరమా? హోలిస్టిక్ డైటీషియన్ డాక్టర్ గీతికా చోప్రా ప్రకారం.. గోధుమ అనేది ఒక సంక్లిష్ట కార్బోహైడ్రేట్. ఇది రోజంతా మీ శక్తి స్థాయిలను నిలకడగా ఉంచడంలో సహాయపడుతుంది. శుద్ధి చేసిన పిండి లాంటి సాధారణ కార్బోహైడ్రేట్లు శక్తిని త్వరగా పెంచి, త్వరగా తగ్గిస్తాయి. కానీ గోధుమ రోటీలో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. బరువు నియంత్రణ: చపాతీ త్వరగా కడుపు నిండిన భావన కలిగిస్తుంది. దీనివల్ల అతిగా తినడాన్ని తగ్గించుకోవచ్చు, తద్వారా బరువును నియంత్రించుకోవచ్చు. కండరాల పెరుగుదల: గోధుమల్లో కండరాల నిర్మాణానికి అవసరమైన ప్రోటీన్ ఉంటుంది. విటమిన్లు, ఖనిజాలు: ఇందులో విటమిన్ బి, ఐరన్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇవి జీవక్రియ, రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడతాయి. కొంతమందికి గ్లూటెన్ పడదు. అలాంటి వారికి చపాతీ తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి, గోధుమలకు బదులుగా రాగి, జొన్న వంటి గ్లూటెన్ రహిత పిండితో చేసిన రోటీలను తీసుకోవడం మంచిది. ఒకవేళ మీకు గ్లూటెన్ పడకపోతేనే గోధుమ రోటీని మానేయండి. మిగిలిన వారందరికీ గోధుమ రోటీ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఉన్న పోషకాలు మీ మొత్తం ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# అమెరికా డ్రగ్స్ జాబితాలో భారత్.. నివేదిక విడుదల చేసిన ట్రంప్

మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణాకు ప్రధాన కేంద్రాలుగా ఉన్న దేశాల జాబితాను అమెరికా విడుదల చేసింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించిన అధికారిక నివేదికలో మొత్తం 23 దేశాల పేర్లను వెల్లడిరచారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ జాబితాలో భారత్‌తో పాటు పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బర్మా కూడా ఉన్నాయి. తమ దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న మాదకద్రవ్యాల ముప్పును ఎదుర్కొనేందుకు కట్టుబడి ఉన్నామని ట్రంప్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ జాబితాలో ఉన్న ఇతర దేశాలలో మెక్సికో, కొలంబియా, వెనిజులా, బొలీవియా, ఈక్వెడార్, పెరూ, పనామా, కోస్టారికా, జమైకా, లావోస్ వంటి దేశాలు ఉన్నాయి. అయితే, ఈ జాబితాలో ఒక దేశం పేరు ఉండటం అనేది ఆ దేశ ప్రభుత్వ వైఫల్యాన్ని సూచించదని అమెరికా తన నివేదికలో స్పష్టం చేసింది. భౌగోళిక, వాణిజ్య, ఆర్థిక కారణాల వల్ల కొన్ని దేశాలు మాదకద్రవ్యాల రవాణాకు అనుకూలంగా మారతాయని, అందుకే వాటిని ఈ జాబితాలో చేర్చినట్లు వివరించింది. ఆయా ప్రభుత్వాలు డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఈ పరిస్థితి ఉండొచ్చని పేర్కొంది. అదే సమయంలో గత 12 నెలలుగా మాదకద్రవ్యాల నియంత్రణ ఒప్పందాలను పాటించడంలో, చర్యలు తీసుకోవడంలో ''దారుణంగా విఫలమైన'' దేశాలుగా ఆఫ్ఘనిస్థాన్, బొలీవియా, బర్మా, కొలంబియా, వెనిజులా పేర్లను ట్రంప్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇదిలా ఉండగా, ఇటీవల భారత నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) పనితీరును భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ప్రశంసించడం గమనార్హం. ఓ అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను ఎన్‌సీబీ ఛేదించిన నేపథ్యంలో ''అక్రమ మాదకద్రవ్యాల నుంచి అమెరికన్లను రక్షించడంలో, వారి ప్రాణాలను కాపాడటంలో సహాయం చేస్తున్నందుకు భారత ఎన్‌సీబీకి ధన్యవాదాలు'' అని అమెరికా ఎంబసీ పేర్కొంది. ఈ నేపథ్యంలో తాజా జాబితాలో భారత్ పేరు రావడం చర్చనీయాంశంగా మారింది.



# అమెరికా పొలిటికల్ లీడర్స్ అవినీతిపరులు..

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఒకవైపు అమెరికా పర్యటనకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.మరోవైపు ఆయన మంత్రివర్గ సహచరులు మాత్రం అగ్రరాజ్యానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికా నేతలు అవినీతిపరులని, వారు ఇజ్రాయెల్ నుంచి లంచాలు స్వీకరిస్తున్నారని ఆరోపించారు. పాకిస్థాన్‌కు చెందిన జియో టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసిఫ్ మాట్లాడుతూ.. తాము లంచాలు స్వీకరించినట్లు తీవ్ర అపవాదులు ఎదుర్కొన్నామని, కానీ అమెరికా రాజకీయ నాయకులు ఇజ్రాయెల్ నుంచి బహిరంగంగానే లంచాలు తీసుకున్నారని ఆరోపించారు. అదే నేను లంచం స్వీకరించాల్సి వస్తే ఎక్కడో చాటుగా తీసుకుంటానని, అయినా తాము నిందలు మోశామని అన్నారు. కానీ అమెరికా నేతలు బహిరంగంగానే అవినీతి చేస్తున్నారని విమర్శించారు. అమెరికా మిలిటరీ అధికారులు, ప్రతినిధులసభ సభ్యులు, ఉన్నతస్థాయి పాలకులు తాము ఇజ్రాయెల్ నుంచి నిధులు అందుకున్నట్లు అంగీకరించారని తెలిపారు. మరోవైపు



పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఏకంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కే షాకిచ్చారు. భారత్ ఎప్పుడూ మూడో దేశం మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదని న్నారు. ఆయన అల్‌జజీరాతో మాట్లాడుతూ.. 'మూడో పక్షం పాత్ర ఉన్నా మేం ఏమీ అనుకోం. కానీ ఇది ద్వైపాక్షిక అంశమే అని భారత్ పేర్కొంది. సరే ఏ చర్చలు జరిగినా ఉగ్రవాదం, వాణిజ్యం, జమ్మూకశ్మీర్‌పై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిం మునీర్ త్వరలోనే అమెరికాలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో పాక్ మంత్రుల ప్రకటనలు వారిని ఇబ్బందుల్లో పడేసేలా ఉన్నాయి.



# ఎస్‌బీఐ బ్రాంచ్‌లో భారీ దోపిడీ

కర్ణాటకలో భారీ దోపిడీ జరిగింది. ఆర్మీ తరహా దుస్తుల్లో వచ్చిన ముగ్గురు సాయుధ దుండగులు సుమారు 20 కోట్ల రూపాయల విలువైన నగలను, కోటి రూపాయల నగదును దోచుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటకోని చడచన్ పట్టణంలోని ఎస్‌బిఐ బ్రాంచ్‌లో మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది.వివరాల ప్రకారం.. ఆర్మీ తరహా యూనిఫామ్ ధరించిన ముగ్గురు దుండగులు బ్యాంక్‌లోకి ప్రవేశించారు. మేనేజర్ మరియు ఇతర ఉద్యోగుల చేతులను కట్టేసి, టాయిలెట్ లోపల బంధించారు. దోపిడీ సమయంలో బ్యాంక్ మేనేజర్ అలారమ్ బెల్‌ను నొక్కకుండా ఆయుధాలతో బెదిరించారు. సిబ్బందిని బెదిరించి స్ట్రాంగ్ రూమ్‌లోకి వెళ్లి నగదు, ఆభరణాలను దోచుకువెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న చడచన్ పోలీస్ సూపరింటెండెంట్ లక్ష్మణ్ నింబార్గి, సీనియర్ అధికారులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నకిలీ నంబర్ ప్లేట్ కలిగిన వ్యాన్‌ను వినియోగించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. బ్యాంకు దోపిడీ అనంతరం దొంగల ముఠా మహారాష్ట్రలోని పంధర్‌పూర్ వైపు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. సోలాపూర్ జిల్లా సమీపంలో ప్రమాదం జరిగిందని, అక్కడ స్థానికులతో వాగ్వివాదానికి దిగినట్లు తెలిపారు. అనంతరం ద్విచక్రవాహనంపై అక్కడి నుండి పారిపోయినట్లు పోలీసులు వెల్లడిరచారు.

# ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్‌బరస్ట్..

**చమోలి:** ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కుంభవృష్టి కురుస్తోన్న విషయం తెలిసిందే. ఈ వర్షాలకు ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. ఇప్పటికే వచ్చిన వర్షాలు, వరదలకు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఇప్పుడు తాజాగా అక్కడ మరోసారి వర్షం బీభత్సం సృష్టించింది. చమోలి జిల్లాలోని నందా నగర్‌లో బుధవారం రాత్రి మేఘవిస్ఫోటనం కారణంగా వరదలు సంభవించాయి. ఈ వరదలకు 10 మంది గల్లంతయ్యారు. గల్లంతైన 10 మందిలో కుంత్రి లగా ఫాలి గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు, సర్పానికి చెందిన వారు ఇద్దరు, దుర్మా ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. ఇక ఈ వరదలకు ఆరు భవనాలు కొట్టుకుపోయాయి. రంగంలోకి దిగిన రెస్క్యూ టీమ్ శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులను రక్షించింది. ఆ ప్రాంతంలో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపడుతోంది. కాగా, రెండు రోజుల క్రితం రాజధాని డెహ్రాడూన్‌లో క్లౌడ్‌బరస్ట్ కారణంగా వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ వరదలకు 15 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గల్లంతయ్యారు.





# భారత కాన్సులేట్‌ను సీజ్ చేస్తాం

కెనడాలోని ఖలిస్థానీ సంస్థ 'సిఖ్స్ ఫర్ జస్టిస్' మరోసారి రెచ్చిపోయింది. ముఖ్యంగా వాంకోవర్‌లోని భారతీయ దౌత్య కార్యాలయాన్ని సీజ్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడిరది.సెప్టెంబర్ 18వ తేదీన భారత కాన్సులేట్‌ను ముట్టడిరచి స్వాధీనం చేసుకుంటామని సదరు సంస్థ ప్రకటించింది. సిక్కు తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు జవాబుదారీగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. సోషల్ మీడియా వేదికగా సిఖ్స్ ఫర్ జస్టిస్ సంస్థ ఈ బెదిరింపులకు పాల్పడిరది. ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్న ఈ పోస్టులో.. సెప్టెంబర్ 18వ తేదీన భారత కాన్సులేట్‌ను ముట్టడిరచబోతున్నట్లు చెప్పింది. ఆ సమయంలో ఇక్కడికి ఎవరూ రావొద్దని కూడా తెలిపింది. అంతేకాకుండా భారత హైకమిషనర్ దినేశ్ కె. పట్నాయక్‌ను లక్ష్యంగా చేసుకుని ఉన్న పోస్టర్లను కూడా విడుదల చేసింది. దీంతో ఇది కాస్తా అంతర్జాతీయ వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ తాజా బెదిరింపులు కెనడా ప్రభుత్వం చేసిన ఒక కీలక ప్రకటన తర్వాత వెలువడటం గమనార్హం. కెనడా ఆర్థిక శాఖ విడుదల చేసిన ఒక నివేదికలో ఖలిస్థానీ తీవ్రవాద గ్రూపులకు కెనడా నుంచే ఆర్థిక సహాయం అందుతోందని మొదటి సారిగా అంగీకరించింది. 'ది 2025 అసెస్‌మెంట్ ఆఫ్ మనీ లాండరింగ్ అండ్ టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ రిస్క్స్' పేరుతో విడుదలైన ఈ నివేదిక.. కెనడా గడ్డపై స్వేచ్ఛగా పని చేస్తున్నాయని ఎప్పటి నుంచో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖలిస్థానీ సంస్థల టెర్రర్ ఫైనాన్సింగ్‌పై హెచ్చరికలు జారీ చేసింది. అనేక సంవత్సరాలుగా.. బాబర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్ వంటి సంస్థలకు కెనడాలో సురక్షిత ఆశ్రయం లభిస్తుందని భారత్ వాదిస్తూ వస్తోంది. అయితే ఇప్పుడు ఒట్టావా ప్రభుత్వం ఈ సంస్థలు, అలాగే హమాస్, హిజ్బుల్లా వంటి ఇతర ఉగ్రవాద సంస్థలు కూడా తమ తీవ్రవాద ఎజెండా కోసం కెనడియన్ ఫండిరగ్ నెట్‌వర్క్‌లు, స్వచ్ఛంద సంస్థలు, లాభాపేక్షలేని సంస్థలను దుర్వినియోగం చేస్తున్నాయని అంగీకరించింది.

# ట్రంప్‌నకు నిరసన సెగ

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బ్రిటన్‌లో అధికార పర్యటన నిమిత్తం బుధవారం లండన్ చేరుకున్నారు. బ్రిటన్‌లో ట్రంప్ పర్యటించడం ఇది రెండోసారి. ఈ పర్యటనలో భాగంగా ట్రంప్‌నకు రాజు చార్లెస్ దంపతులు ఆతిథ్యాన్ని ఇస్తున్నారు. ఈ సందర్భంగా చార్లెస్ దంపతులతో పాటూ ప్రిన్స్ విలియం, ఆయన సతీమణి కేట్‌లతో కూడా ట్రంప్ భేటీ అయ్యారు. వెయ్యి ఏళ్ళకు పైగా బ్రిటన్ రాజకుటుంబాలకు నెలవుగా వున్న విండ్సర్ కోటలోనే ట్రంప్ బస చేస్తున్నారు. అంతకుముందు ట్రంప్‌కు కోటలో ఘనంగా రెడ్ కార్పెట్ స్వాగతం లభించింది. తుపాకులతో గౌరవవందనాలు, మిలటరీ కవాతు అనంతరం విలాసవంతమైన విందు ఏర్పాటు చేశారు. బ్రిటన్ సహా పలు కీలకమైన వాణిజ్య భాగస్వాములతో అమెరికా వాణిజ్య చర్చలు జరుపుతున్న నేపథ్యంలో ఈ పర్యటన జరుగుతోంది. ఈ పర్యటనలో సాంకేతికత, పౌర అణు ఒప్పందం సహా ఇరు దేశాల మధ్య అనేక ఒప్పందాలు జరగనున్నాయి. ట్రంప్‌కు బ్రిటన్‌లో నిరసనల సెగ తప్పడం లేదు. ట్రంప్ పర్యటనను నిరాకరిస్తూ మంగళవారం విండ్సర్ కోట వెలుపల స్టాప్ ట్రంప్ కొయిలేషన్‌కి చెందిన నిరసనకారులు ఆందోళన చేపట్టారు. కోట భవనాల్లో ఒకదానిపై ట్రంప్, లైంగిక వేధింపుల నేరస్తుడు జెఫ్రీ ఎపిస్టెన్‌లు కలిసి వున్న ఫోటోను ప్రదర్శించారు. ఆ సమయానికి ట్రంప్ అక్కడకు రాలేదు. దాంతో అధికారులు వెంటనే స్పందించి ఆ వీడియోను, ఫోటోలను తొలగించారు. ఈ సందర్భంగా నలుగురిని అరెస్టు చేశారు. లండన్‌లో బుధవారం పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి. వాటిని అదుపు చేసేందుకు దాదాపు 1600మంది పోలీసు అధికారులను రంగంలోకి దించారు. ఇటీవల కాలంలో విచ్ఛిన్నకర, మితవాద రాజకీయాలను రెచ్చగొడుతున్న నేత ట్రంప్ అని ఆందోళనకారులు విమర్శించారు.**

# ఈక్వెడార్ డీజిల్ సబ్సిడీ రద్దు

డీజిల్ సబ్సిడీని రద్దు చేస్తున్నట్టు ఈక్వెడార్ అధ్యక్షుడు డేనియల్ నోబోవాస్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వందలాది మంది యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళనబాట పట్టారు. ఈక్వెడార్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల జీవన వ్యయం విపరీతంగా పెరుగుతుందని వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడి పదవి నుంచి డేనియల్‌ను తప్పించాలని వారు పిలుపునిచ్చారు. కాగా, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఈక్వెడార్ నుంచి ఈ ఆందోళన ప్రారంభమై.. ఈక్వెడార్ రాజధాని క్విటో నగర వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా 'నోబోవా అవుట్' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. అధ్యక్ష భవనం కరోన్‌డెలెట్ ప్యాలెస్‌ను చుట్టుముట్టాలని లక్ష్యంగా పెట్టుకుంటే.. మార్గ మధ్యలోనే పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. పోలీసులు, మిలి టరీ దళాలు వీధుల్లో బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. అయినప్పటికీ నిరసన కారులు వెనక్కి తగ్గకుండా.. పోలీసులపై రాళ్లు



రువ్వారు. దీంతో వారిపై పోలీసులు భాష్పవాయువును ప్రయోగించారు. శుక్రవారం సెప్టెంబర్ 12న నొబావా సంతకం చేసిన డిక్రీ 126కి వ్యతిరేకంగా విద్యార్థులు ఈ మార్చ్ నిర్వహించారు. ప్రభుత్వం డీజిల్ సబ్సిడీ తగ్గించడం ద్వారా ప్రజలపై ఏడాదికి 1.1 బిలియన్ డాలర్ల మేర భారం పడనుంది. ఈ 126 డిక్రీని రద్దు చేసే వరకు నిరసనలు కొనసాగుతాయని యూసీఈ యూనివర్సిటీ కౌన్సిల్ ప్రతినిధి విల్ చుక్విమార్కా ప్రకటించారు. ప్రధానంగా ఇంధన ధరలు పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయని ఆయన హెచ్చరించారు. ఈక్వెడార్‌లో విస్తృతంగా విని యోగంలో ఎక్స్‌ట్రా అండ్ ఎకోపైస్ గ్యాసోలిన్, టు 85 ఆక్టేన్ ఇంధనా లపై గతేడాది నోబొవా లకు సబ్సిడీలను రద్దు చేయడం గమనార్హం.

# ఇవిఎంలపై అభ్యర్థుల కలర్ ఫొటో

**న్యూఢిల్లీ: ఈసారి ఓటు వేసేముందు ఈవీఎంలపై పోటీ చేసే అభ్యర్థుల కలర్ ఫోటోలు దర్శనం ఇస్తాయి. అభ్యర్థుల ముఖాలు స్పష్టంగా కన్పించేందుకు ఇప్పటివరకూ ఉన్న నలుపు తెలుపు ఫోటోలస్థానే కలర్ ఫోటోలు ఏర్పాటు చేస్తారు. అలాగే సీరియల్ నెంబర్ లు కూడా ఉంటాయి. ఈవీఎం బ్యాలెట్ పేపర్ల లేఅవుట్ ను మార్చడానికి ఎన్నికల సంఘం తన నియమ నిబంధనల్లో మార్పులు చేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే ఈ కొత్త మార్పు అమలవుతుంది. 1961 ఎన్నికల నిర్వహణ నియమాలలోని 49 బి రూల్ ప్రకారం అభ్యర్థుల ఛాయా చిత్రాలు ఇప్పుడు రంగుల్లో ముద్రిస్తారు. మునుపటి నలుపు తెలుపు లేదా ఫోటో లేని వెర్షన్ స్థానంలో మరింత స్పష్టతకోసం నిబంధన మారుస్తున్నారు. అంతే కాదు బ్యాలెట్ పేపర్ పై అభ్యర్థి సీరియల్ నెంబర్ కూడా మరింత స్పష్టంగా కన్పిస్తుంది. నిబంధనలను మార్చి, పోలింగ్ బూత్ లలో గందరగోళాన్ని తగ్గించేందుకు డిజైన్, ప్రింట్ రెండిరటినీ మార్చారు. ఎన్నికల ప్రక్రియ క్రమబద్ధీకరణకు, ఓటర్లకు మరింత చేరువ కావడానికి ఎన్నికల సంఘం ఆరు నెలలుగా దాదాపు 28 మార్పులను చేపట్టింది. అభ్యర్థుల పేర్లు, నోటా ఓటర్లు చదువుకోడానికి సులభంగా ఒకే ఫాంట్ లో ముద్రిస్తారు. ఈవీఎం బ్యాలెట్ పత్రాలను 70 జిఎస్ఎం కాగితంపై ముద్రిస్తారు. అసెంబ్లీ ఎన్నికల కోసం గులాబీ రంగు కాగితాన్ని ఉపయోగిస్తారు. బీహార్ లో రానున్న అసెంబ్లీ ఎన్నికలలోనే అప్ గ్రేడ్**



చేసిన ఈవీఎం బ్యాలెట్ పత్రాలను ఉపయోగిస్తారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in